# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న హరీశ్ రావు

సంగారెడ్డి, మాజీ మంత్రి హరీశ్ రావుమరోసారి ఇచ్చిన మాట నిలబెట్టుకున్నారు. బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. వివరాల్లోకి వెళ్తే.. సంగారెడ్డి జిల్లా కోహిర్ మండలం సజ్జాపూర్ గ్రామానికి చెందిన బేగరి రాములును గ్రామ పంచాయతీ ఎన్నికల్లో తమకు ఓటు వేయలేదనే ద్వేషంతో సర్పంచ్, ఆమె కుమారుడు ప్రసాద్ రెడ్డి రాములుకు చెందిన ఇంటిని జేసీబీతో ఈ నెల23వ తేదీన కూల్చివేశారు. దీంతో తమకు న్యాయం చేయాలని బాధితుడు హరీశ్ రావుతో మొరపెట్టుకున్నారు. స్పందించిన హరీశ్ రావు తనవంతుగా లక్ష రూపాయలను అందజేస్తాని హామీ ఇచ్చారు. కాగా, హరీశ్ రావు అందదించిన నగదును లక్ష రూపాయల నగదును జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్ రావు చేతుల మీద అందజేశారు. బాధిత కుటుంబానికి బీఆర్ ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


# అగ్రనేత

TELTEL/2015/66279

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి | సంపుటి: 10 సంచిక :261 | ఎడిటర్ : ఉప్పుగల్ల సంతోష్ కుమార్ | తేది:ఆదివారం 28-12-2025 | పేజీలు:4 వెల: 2.00


## ఆయన చేపలు తిన్నారు.. ఈయన కోడి కూర తిన్నారు.. జగన్, కేసీఆర్‌లపై జగ్గారెడ్డి సెటైర్లు



విజయవాడ, డిసెంబర్ 27: మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ జగన్, కేసీఆర్‌పై తెలంగాణ పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి సెటైర్లు విసిరారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఇరు రాష్ట్రాల మధ్య ఉన్న సమస్యలపై ఉన్నత స్థాయిలో చర్చ జరగాలన్నారు. నీటి ప్రాజెక్టులు, కేటాయింపులపై ఇరు రాష్ట్రాల సీఎంలు కూర్చుని మాట్లాడుకుంటారని తెలిపారు. గతంలో కేసీఆర్.. జగన్ ఇంటికి వచ్చి చేపలు తిన్నారని.. జగన్ హైదరాబాద్‌లో కేసీఆర్ ఇంటికి వచ్చి కోడి కూర తిన్నారంటూ సెటైరికల్ కామెంట్స్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి మాత్రం అంత దిగజారి వ్యవహరించరని స్పష్టం చేశారు. ప్రభుత్వపరంగా సీఎంలు, ఆశాఖ మంత్రులు చర్చించాల్సిన అంశాలపై తానేమీ మాట్లాడనని తెలిపారు. గతంలో జగన్, కేసీఆర్‌లు వీటిపై ఎప్పుడైనా చర్చలు చేశారా అని ప్రశ్నించారు. మీడియా వాళ్లు వారిని ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రెండు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలని, ఇరు రాష్ట్రాల ప్రజలు బాగుండాలనేదే తన ఆకాంక్ష అని జగ్గారెడ్డి స్పష్టం చేశారు.

### అది ఒక చరిత్ర...

విశాఖ స్టీల్ ప్లాంట్‌పై జగ్గారెడ్డి మాట్లాడుతూ.. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది ఒక చరిత్రన్నారు. ఆనాడు ప్రజల భాగస్వామ్యంతో విశాఖ ఉక్కు కర్మాగారం ఏర్పాటు చేశారని తెలిపారు. గుంటూరు నుంచి విశాఖ వెళ్లి ఆ ఫ్యాక్టరీ కోసం పోరాటాలు చేశారని గుర్తుచేశారు. 1970లో ఇందిర గాంధీ విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై పార్లమెంటులో ప్రకటించారని తెలిపారు. ఇచ్చిన మాట ప్రకారం విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాంగ్రెస్ జాతికి అంకితం చేసిందని చెప్పుకొచ్చారు. రూ.14 వేల కోట్లతో ఏర్పాటు చేసిన స్టీల్ ప్లాంట్ వల్ల విశాఖపట్నం ఎంతో అభివృద్ధి చెందిందని అన్నారు. వేలు, లక్షల కుటుంబాలు స్టీల్ ప్లాంట్‌పై ఆధారపడి జీవనం సాగించారన్నారు. ఆనాటి ఉద్యమం ద్వారా అనేక మంది నాయకులుగా ఎదిగారని తెలిపారు. వెంకయ్య నాయుడు కూడా ఉద్యమం ద్వారా జాతీయ స్థాయి నేతగా ఎదిగారని ఆయన అన్నారు.

### జగన్ ఎందుకు మాట్లాడరు...

యూపీఏ ప్రభుత్వంలో నష్టాలను భర్తీ చేస్తూ విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడుతూ వచ్చారన్నారు. రూ.14 వేల కోట్లతో ప్రారంభించిన స్టీల్ ప్లాంట్ విలువ నేడు రెండున్నర లక్షల కోట్ల సంపదకు చేరిందని వెల్లడించారు. దీనిపై మోదీ కన్నుపడటంతో ఎవరికో కట్టపెట్టాలనే దురుద్దేశంతో కుట్రలు మొదలయ్యాయని ఆరోపించారు. బీజేపీ ప్రభుత్వం ఏర్పడే సమయానికి రాష్ట్రం విడిపోయిందన్నారు. విభజన వల్ల ఏపీలో కాంగ్రెస్‌ను ప్రజలు పూర్తిగా ఓడించారన్నారు. విభజన అనంతరం చంద్రబాబు, జగన్‌లు సీఎంగా చేశారని.. ఇప్పుడు మళ్లీ చంద్రబాబు సీఎం అయ్యారన్నారు. పోలీసులు ఏ ప్రభుత్వం ఉంటే వారికే వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. మోదీ ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత ప్రభుత్వ ఆస్తులు కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని విమర్శించారు. రెండు లక్షల కోట్లు విలువ చేసే విశాఖ స్టీల్ ప్లాంట్ కూడా కట్టపెట్టేలా కుట్రలు చేస్తున్నారన్నారు. ఈ విషయంలో మాజీ సీఎం జగన్ ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. సోనియా గాంధీ రాజకీయంగా నష్టపోతామని తెలిసి కూడా విభజన చేసి మాట నిలపెట్టుకున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్... ఆంధ్రుల హక్కు అని దానిని కాపాడుకోవాలని జగ్గారెడ్డి పేర్కొన్నారు.

## భాష మార్చుకుని.. హుందాగా వ్యవహరించు..

హైదరాబాద్,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలని, స్థాయికి తగినట్లు హుందాగా వ్యవహరించాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హితవు పలికారు. శనివారం సికింద్రాబాద్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో 19 మంది లబ్ధిదారులకు షాదీముబారక్ (15), కళ్యాణ లక్ష్మీ (4) ఆర్థికసాయం చెక్కులను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎన్నికలకు ముందు ఆచరణ సాధ్యం కాని అనేక హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు అమలు చేయకుండా వాటిని ఎగ్గొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కళ్యాణ లక్ష్మీ, షాదీముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం ఇస్తామని రెండేళ్లు అవుతున్నా నేటి వరకు ఒక్కరికి కూడా తులం బంగారం ఇవ్వలేదని, ఎప్పుడు ఇస్తారని లబ్ధిదారులు ప్రశ్నిస్తున్నారని తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. దీనికి ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలకు ప్రతి నెలా అందిస్తామన్న 2500 రూపాయలు ఏమయ్యాయని, వికలాంగులకు 3 వేల నుంచి 6 వేలకు పెంచుతామన్న పెన్షన్ ఎప్పుడు ఇస్తారని ప్రశ్నించారు. ఇందిరమ్మ ఇండ్లు ఎప్పుడు నిర్మిస్తారని పేదలు అడుగుతున్నారని వీటికి సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తొండలు వదులుతా.. పేగులు మెడలో వేసుకుంటా అంటూ ముఖ్యమంత్రి అని మాట్లాడటం విచారకరమని అన్నారు. బూతులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి స్థానానికి ఉన్న గౌరవాన్ని దిగజార్చుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా సీఎం రేవంత్ రెడ్డి తన భాష మార్చుకోవాలని, మంచి పనులు చేసి ప్రజల మన్ననలను పొందారని సూచించారు.



### ఇష్టానుసారంగా డీ లిమిటేషన్

డీ లిమిటేషన్ పేరుతో ప్రభుత్వం, అధికారులు ఇష్టానుసారంగా జీహెచ్ఎంసీలోని డివిజన్లను ఏర్పాటు చేశారని తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీలు, ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడం బాధాకరమని అన్నారు. దీనిపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసినా, కౌన్సిల్ సమావేశాలలో అభ్యంతరాలు తెలిపినా పట్టించుకోలేదని విమర్శించారు. హడావుడిగా డివిజన్ లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎందుకు వచ్చిందో ఎవరికి అర్థం కావడం లేదన్నారు. అధికారంలో ఉన్నాం%ొ% మా ఇష్టమొచ్చినట్లు చేస్తాం అన్నట్లుగా ప్రభుత్వ వైఖరి ఉందని విమర్శించారు. సికింద్రాబాద్ జోనల్ ఆఫీస్ మోండా డివిజన్ పరిధిలో ఉంటే మోండా డివిజన్ ను తీసుకెళ్లి మల్కాజ్ గిరిలో కలపడమేంటని ప్రశ్నించారు. మీ విధానాలు మార్చుకోకపోతే ప్రజలు బండకేసి కొడతారని ధ్వజమెత్తారు.

## పాక్‌తో అప్రమత్తంగా ఉండాల్సిందే...

న్యూఢిల్లీ,డిసెంబర్27: కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆపరేషన్ సిందూర్ తరవాత మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం వచ్చిందన్నారు. పాక్‌ను తక్కువ అంచనా వేయకుండా అప్రమత్తంగా ఉండాలని, అలాగే దానిని నమ్మడానికి లేదన్నారు. పాకిస్థాన్‌లో మారుతున్న సైనిక వ్యూహాలు, అభివృద్ధి చెందుతున్న హైపర్ సోనిక్ క్షిపణి వ్యవస్థలను.. భారత్ తేలిగ్గా తీసుకోకూడదని హెచ్చరించారు . ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ థరూర్ ఈ వ్యాఖ్యలు చేశారు. పాక్‌తో ఉన్న గత అనుభవాల నుంచి భారత్ చాలా నేర్చుకున్నందున ఏ పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు పూర్తి సిద్ధంగా ఉండాలన్నారు. డ్రోన్లు, రాకెట్లు, క్షిపణుల తర్వాత హైపర్‌సోనిక్ సాంకేతికతపై పాక్ దృష్టిసారించిందన్నారు. ఇది భారత్ తేలికగా తీసుకునే విషయం కాదన్నారు. పాక్‌లో ప్రజాస్వామ్యం నామమాత్రంగానే ఉందని.. ఇప్పటికీ సైనిక ఆధిపత్యమే కొనసాగుతుందన్నారు. ఆర్థికంగా దుర్భర పరిస్థితిలో ఉన్న ఆ దేశం.. విదేశాల నుంచి అందే సాయంపైనే ఆధారపడుతుందని థరూర్ అన్నారు. ఇక, బంగ్లాదేశ్ దాని సొంత సమస్యలతో సతమతమవుతోందన్నారు. పాక్‌తో రక్షణ ఒప్పందానికి బంగ్లా చేస్తున్న చర్చల



గురించి ప్రస్తావిస్తూ.. భారత్ మాకు శత్రువు అనే అభిప్రాయాన్ని కల్పించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పొరుగు దేశాల్లో పెరుగుతున్న భారత వ్యతిరేకతపై ఆయన మాట్లాడుతూ.. బంగ్లాలో స్థిరమైన, శాంతియుత వాతావరణం మనకు చాలా కీలకమన్నారు. ఈశాన్య రాష్ట్రాలను భారత్ నుంచి విడదీస్తామంటూ వస్తోన్న హెచ్చరికలపై ఆందోళన వ్యక్తం చేశారు.

## ఈ ఏడాది అత్యధికమంది భారతీయుల్ని బహిష్కరించింది అమెరికా కాదు..



వాషింగ్టన్: అమెరికా వేల సంఖ్యలో భారతీయుల్ని బహిష్కరించిన విషయం తెలిసిందే. యూఎస్‌లో అక్రమంగా నివసిస్తున్నారంటూ వారిని స్వదేశానికి వెళ్లగొట్టింది. ఈ వ్యవహారం దేశవ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే. అయితే, అత్యధికంగా భారతీయుల్ని బహిష్కరించింది అమెరికా కాదని కేంద్రం వెల్లడించింది. ఈ ఏడాది ఎక్కువ మంది భారతీయుల్ని బహిష్కరించిన దేశం సౌదీ అరేబియా అని తెలిపింది. ఈ మేరకు కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ ఇటీవలే రాజ్యసభ కు వివరాలు వెల్లడించింది. ఆ వివరాలు తాజాగా బయటకు వచ్చాయి. ఈ ఏడాది (2025) మొత్తం 81 దేశాలు 24,600 మందికిపైగా భారతీయుల్ని బహిష్కరించాయి. అందులో అత్యధికంగా సౌదీ అరేబియా తొలిస్థానంలో నిలిచింది. 12 నెలల్లో సౌదీ అరేబియా 11 వేల మందికంటే ఎక్కువ మంది భారతీయుల్ని దేశం నుంచి వెళ్లగొట్టింది. ఆ తర్వాత అమెరికా 3,800 మంది భారతీయుల్ని డిపోర్ట్ చేసింది. అమెరికాలో గత ఐదేళ్లలో ఇదే అత్యధిక బహిష్కరణలు. వాషింగ్టన్ డీసీ నుంచే 3,414 మంది భారతీయులు బహిష్కరణకు గురయ్యారు.సౌదీ అరేబియా, అమెరికా తర్వాత మయన్మార్ మూడో స్థానంలో నిలిచింది. ఈ ఏడాది మయన్మార్ 1,591 మంది భారతీయుల్ని గెంటేసింది. మలేషియా 1,485 మందిని, యూఏఈ 1,469 మంది భారతీయుల్ని బహిష్కరించాయి. వీసా కాలపరిమితి తీరడం, వర్క్ పర్మిట్ లేకుండా ఉద్యోగాలు చేయడం, కార్మిక నిబంధనలు వంటి కారణాలతో ఆయా దేశాలు భారతీయుల్ని బహిష్కరించాయి. బహ్రెయిన్ 764 మందిని, థాయిలాండ్ 481 మందిని, కంబోడియా 305 మందిని రిపోర్ట్ చేశాయి. ఇక భారతీయ విద్యార్థులను బహిష్కరించిన దేశాల్లో యూకే తొలిస్థానంలో నిలిచింది. ఈ ఏడాది 170 మంది భారతీయ విద్యార్థులను యూకే డిపోర్ట్ చేసింది. ఆస్ట్రేలియా 114 మందిని, రష్యా 82 మంది భారతీయ విద్యార్థులను స్వదేశానికి పంపించింది.

## బంగ్లాతో భారత్ సంబంధాలు లాభమా? నష్టమా?



న్యూఢిల్లీ,నరేంద్ర మోడీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన తర్వాత నెలరోజు నుంచి షేక్ హసీనాకు వ్యతిరేకంగా బంగ్లాదేశ్ లో ప్రజలు వీధుల్లోకి వచ్చి పోరాటం మొదలుపెట్టారు. ఈ నిరసనలు ఆగస్టు 5న తీవ్ర హింసాత్మకంగా మారాయి. షేక్ హసీనా తన పాణాలను కాపాడుకోవడానికి భారత్ కు రావాల్సి వచ్చింది. బంగ్లాదేశ్ లో నిరంకుశ పాలనను కొనసాగించారని ఆమెపై ఆరోపణలు ఉన్నాయి. బంగ్లాదేశ్ వ్యవస్థాపకుడిగా పేరున్న హసీనా తండ్రి ముజిబుర్ రెహమాన్ కు, భారత్ తో చారిత్రాత్మక సంబంధాలు ఉన్నాయి. షేక్ హసీనా, భారత్‌మధ్య సంబంధాలు కూడా అదేవిధంగా కొనసాగాయి. అయితే, భారత్ మద్దతుతోనే షేక్ హసీనా అధికారంలో ఉన్నారని బంగ్లాదేశ్ లోని ప్రతిపక్షాలు, షేక్ హసీనా వ్యతిరేకులు ఆరోపిస్తూ వచ్చారు. గతేడాది ఆగస్టులో షేక్ హసీనాకు భారత్ ఆశ్రయం ఇచ్చిన తర్వాత బంగ్లాదేశ్ లో యాంటీ ఇండియా సెంటిమెంట్ మరింత పెరిగింది. బంగ్లాదేశ్ ను భారత్ ఎప్పుడూ షేక్ హసీనా కుటుంబదృష్టితోనే చూస్తోందని, అంతకు మించి చూసేందుకు ఎప్పుడూ ప్రయత్నించలేదని బంగ్లాదేశ్ మీడియా అంటోంది.

### హసీనా విషయంలో దెబ్బతిన్న సంబంధాలు

గతేడాది షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత, తాత్కాలిక ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఈ తాత్కాలిక ప్రభుత్వ పాలనలో ద్వైపాక్షిక సంబంధాలు మరింత దెబ్బతిన్నాయి. గతేడాది డిసెంబర్ నుంచి సంబంధాలు క్షీణించాయి. 'ఢాకా, దిల్లీ మధ్యలో ఇంత అపనమ్మకం, అనుమానాన్ని నేనెప్పుడూ చూడలేదు. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం, ఇరుదేశాలు దౌత్య కార్యాలయాలకు భద్రత కల్పించాలి. రెండు పొరుగుదేశాలు, ఒకదానిపై మరొకటి ఆధారపడి ఉన్నందున భారత వాస్తవాన్ని అంగీకరించి, బంగ్లాదేశ్ తో ఉన్న సంబంధాల విషయంలో

## సోషల్ మీడియాలో కొత్త పరిచయాలు వద్దు! సీపీ సజ్జనార్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్,ఇంటిగ్రేటెడ్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో నిర్వహించిన.. హైదరాబాద్ సిటీ పోలీస్ అన్యువల్ ప్రెస్ మీట్ 2025లో సీపీ సజ్జనార్ నగర భద్రత, నేరాల నియంత్రణ, సాంకేతిక వినియోగం, ప్రజల భాగస్వామ్యం వంటి కీలక అంశాలపై సమగ్రంగా వివరించారు. ఇది తొలిసారి డిజిటల్ ఫార్మెట్‌లో నిర్వహించామని, ఈ ఏడాది హైదరాబాద్ ప్రజల సహకారం పోలీస్ విభాగానికి ప్రధాన బలంగా నిలిచిందని ఆయన తెలిపారు. హైదరాబాద్ సిటీ పోలీస్ చేపట్టిన ప్రతి కార్యక్రమంలో ప్రజలు చురుకుగా పాల్గొని మద్దతుగా నిలిచారని, ముఖ్యంగా పండగల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించగలిగామని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఎన్నికల సమయంలో కూడా ప్రజలు పూర్తి స్థాయిలో సహకరించారని సీపీ ప్రశంసించారు. హోమ్ గార్డ్ స్థాయి నుంచి అడిషనల్ సీపీ వరకు ప్రతి ఒక్కరు నిబద్ధతతో పనిచేయడం వల్లే ఇది సాధ్యమైందన్నారు. విజిబుల్ పోలీసింగ్ అమలు చేయడం ద్వారా నగరంలో మొత్తం నేరాలు.. సుమారు 15 శాతం తగ్గాయని వెల్లడించారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మరింత మెరుగైన సేవలు అందించామని, వచ్చే ఏడాది పోలీసింగ్‌లో డ్రోన్ల వినియోగం ప్రారంభించనున్నట్లు తెలిపారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో డ్రోన్ల పనితీరును పరిశీలించామని, అదే అనుభవాన్ని హైదరాబాద్ సిటీ పోలీస్ వ్యవస్థలో వినియోగిస్తామని స్పష్టం చేశారు. నగరవ్యాప్తంగా సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల ఇతర రాష్ట్రాల నేరగాళ్ల గ్యాంగులు.. హైదరాబాద్‌కు రావడానికి వెనుకాడుతున్నాయని చెప్పారు. సైబర్ క్రైమ్‌పై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో.. 8 శాతం సైబర్ నేరాలు తగ్గాయని తెలిపారు. ఈ ఏడాది మొత్తం 526 మంది సైబర్ నేరగాళ్లను అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. ఇన్వెస్ట్‌మెంట్, స్టాక్ మార్కెట్, ఓటీపీ, జాబ్, మ్యాట్రిమోని, వాట్సాప్ డీపీ పేర్లతో జరుగుతున్న మోసాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసర లింకులు ఓపెన్ చేయకూడదని సూచించారు. మహిళల పట్ల నేరాలు 6 శాతం పెరిగాయని, పిల్లలపై నేరాలు, ముఖ్యంగా పోక్సో కేసులు 27 శాతం పెరిగాయని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడతామని, షీ టీమ్స్‌ను మరింత బలోపేతం చేస్తామని అన్నారు. బాధిత మహిళలకు భరోసా కల్పించే విధంగా పోలీస్ వ్యవస్థ ముందుకు సాగుతుందన్నారు. మహిళలు, యువతులు తమ ప్రైవేట్ ఫోటోలు, వీడియోలు ఎవరికీ పంపకూడదని సీపీ సజ్జనార్ స్పష్టంగా హెచ్చరించారు. ఒకసారి ఫోటోలు ఇతరుల చేతుల్లోకి వెళ్తే అవి ఎలా, ఎక్కడ, ఏ విధంగా దుర్వినియోగం అవుతాయో తెలియదని అన్నారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ పరిచయాల విషయంలో మహిళలు మరింత జాగ్రత్తగా ఉండాలని



సూచించారు. అదే విధంగా పిల్లలకు ఇంటర్నెట్ వినియోగంపై తల్లిదండ్రులు తప్పనిసరిగా అవగాహన కల్పించాలి అని సీపీ సూచించారు. సోషల్ మీడియాలో ఏర్పడే ప్రతి పరిచయం నిజమైనది కాదని, పిల్లలు ఏమి చూస్తున్నారు, ఎవరితో మాట్లాడుతున్నారు అనే విషయాలపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. పిల్లల భద్రత కోసం కుటుంబం, సమాజం, పోలీస్ వ్యవస్థ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని సజ్జనార్ స్పష్టం చేశారు. డ్రగ్ ఫ్రీ సొసైటీ లక్ష్యంగా హైదరాబాద్ సిటీ పోలీస్ నిరంతరం పని చేస్తోందని తెలిపారు. గత ఏడాది 322 డ్రగ్ కేసులు నమోదైతే, ఈ ఏడాది 368 కేసులు నమోదు చేసి, 6.45 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేసినట్లు చెప్పారు. ఇంటెలిజెన్స్ నెట్‌వర్క్‌ను మరింత విస్తరించి డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నేరాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని, 49,732 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, న్యూ ఇయర్ వేడుకల సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. ఫ్యామిలీతో ఉంటారా లేక జైలులో ఉంటారా అనేది మీరే నిర్ణయించుకోవాలి అంటూ ప్రజలకు స్పష్టమైన సందేశం ఇచ్చారు. డేంజరస్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్‌ను ఎవరూ ప్రోత్సహించకూడదన్నారు. భవిష్యత్తులో AI డ్రివెన్ పోలీసింగ్, స్మార్ట్ ట్రాఫిక్ సిస్టమ్, కమ్యూనిటీ పోలీసింగ్ ద్వారా.. మరింత బెటర్ పాలసింగ్ అందిస్తామని చెప్పారు. కల్తీ ఆహారాన్ని నియంత్రించేందుకు యాంటీ ఫుడ్ అడల్టరేషన్ టీమ్స్ ఏర్పాటు చేసి ప్రత్యేక నిఘా పెడతామన్నారు. తెలంగాణ పోలీస్ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని గర్వంగా పేర్కొన్నారు. ప్రజలకు ఏ సమస్య వచ్చినా డయల్ 100 ద్వారా సంప్రదించవచ్చని, హైదరాబాద్ ప్రజల కోసం పోలీసులు 24/7 అందుబాటులో ఉంటారని సీపీ సజ్జనార్ భరోసా ఇచ్చారు. ప్రజల సహకారంతో రానున్న రోజుల్లో మరింత సురక్షితమైన, శాంతియుతమైన హైదరాబాద్‌ను నిర్మిస్తామని ఆయన స్పష్టం చేశారు.

## ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచా.. ఉపఎన్నిక వస్తే.. మళ్లీ గెలుస్తా

హైదరాబాద్: ఉపఎన్నికల్లో పోటీ చేయడానికి ధైర్యం.. రాజీనామా చేయడానికి తన ధైర్యం.. కార్యకర్తలేనని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. కార్యకర్తల అండతోనే ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచానని, ఉపఎన్నిక వస్తే.. మళ్లీ గెలుస్తానని అన్నారు. హిమాయత్ నగర్ డివిజన్ కార్యకర్తలతో సమావేశమయ్యారు. రాజీనామాపై, ఉపఎన్నికల్లో పోటీ చేయడంపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సిఎం పదవికి గౌరవం ఇవ్వడం మరిచింది బిఆర్ఎస్ నేతలేనని, సిఎం రేవంత్ రెడ్డిను ఏకవచనంతో అగౌరవంగా మాట్లాడింది బిఆర్ఎస్ వాళ్లేనని తెలియజేశారు. విమర్శలు చేస్తే.. ప్రతి విమర్శలూ ఎదుర్కోవాల్సి ఉంటుందని దానం నాగేందర్ సూచించారు. సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తి గురించి తప్పుగా మాట్లాడితే, ఆ వ్యక్తి కూడా కిందికి మాట్లాడాల్సి వస్తుందని, గురివింద గింజకు తన కింద ఉన్న నలుపు తెలియదని పేర్కొన్నారు. సిఎం స్థాయిలో ఉన్న వ్యక్తికి గౌరవం ఇవ్వలేదని మండిపడ్డారు. ఏకవచనంతో



సంబోధించడం సరికాదని హితవు పలికారు. అభివృద్ధిపై చర్చకు రావాలని బిఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు దానం నాగేందర్ సవాల్ విసిరారు.

## సంపాదకీయం

ఆదివారం 28-12-2025

# ఆరావళికి విజయోస్తు !

ఆరావళిపై సాగుతున్న అరాచకంపై ప్రజలు మేల్కొని ఉద్యమబాట పట్టడంతో కథ అడ్డం తిరిగింది. అంటే ప్రజా ఉద్యమాలకు బలం ఉందని తేలింది. ప్రజా ఉద్యమాలను న్యాయస్థానాలు సైతం అంగీకరిస్తున్నాయి. అందువల్ల సమస్యలపై ముఖ్యంగా పర్యావరణ సమస్యలపై పోరాటం చేయాల్సిందేనని ఆరావాళి మనకు హెచ్చరించింది. ఇది ఆరంభంగా తీసుకోవాలి. దేశంలో ఎక్కడిక్కడ ప్రజలు దేశ పర్యావరణ విధ్వంసంపై ఉద్యమించాలి. నదుల అనుసంధనం ద్వారా నీటి వృధాను అరికట్టేందుకు నడుం బిగించాలి. క్యాన్సర్ కారక పరిశ్రమలకు వ్యతిరేకంగా ఉద్యమించాలి. అన్నింటికి మించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా పెద్ద ఉద్యమం అవసరం. ఇదంతా ఎందుకు చర్చించుకోవాలంటే ఆరావళిని కార్పోరేట్లకు ధారాదత్తం చేయాలన్న ప్రభుత్వ కుట్రలకు వ్యతిరేకంగా ఉద్యమించడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గింది. సుప్రీం ఆదేశాలతో అక్కడ తవ్వకాలకు స్వస్తి పలికింది. సహజసిద్దంగా, భారత్‌కు రక్షణ గోడలా ఉన్న ఆరావళి పర్వతాల్లో తవ్వకాలకు వ్యతిరేకంగా పర్యావరణవేత్తలు, ప్రజలు, మేధావులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. సోషల్ మీడియాలో ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. ప్రభుత్వ అనుకూల మీడియా సైతం వ్యతిరేకించడం విశేషం. ప్రజాందోళనలు అంతకంతకూ మృగ్యమైపోతున్న ప్రస్తుత కాలంలో ఉదయ్‌పూర్ నుంచి ఢిల్లీ దాకా ఉద్యమం రాజుకోవడం, పర్యావరణవేత్తలు, సామాన్య ప్రజలు అనే తేడా లేకుండా తమను కంటికి రెప్పలా కాపాడుతున్న ఆరావళిని కాపాడేందుకు నడుం బిగించారు. కార్పొరేట్ లాభాలు తాత్కాలికమైనవి. పర్యావరణ నష్టాలు శాశ్వతమైనవని గుర్తించారు. అందుకే ఆరావళి జోలికి రాకుండా ఉద్యమించారు. ఢిల్లీ కాలుష్యంలో ఊపిరిసలుపక అవస్థలు పడుతున్న కేంద్ర పెద్దలు అరావళిని తమ తాబేదార్లకు తెగనమ్మే దిశగా అడుగులు వేయడం విస్మయం కలిగించక మానదు. ఎందుకంటే ఇప్పటికీ ఢిల్లీ కాలుష్య నివారణపై కదలిక కానరావడం లేదు. కాలుష్యం మూలాలను కనిపెట్టడం లేదు. సుప్రీంకోర్టు మొట్టికాయలు వేస్తున్నా, ప్రజలు ఆందోళన చెందుతున్నా కార్యాచరణ శూన్యం ఈ దశలో ఆరావళిపై జరిగిన పోరాటం గుర్తుకు తెచ్చుకోవాల్సిందే. ఆలస్యంగానైనా లెంపలు వేసుకుని అరావళి రక్షణపై, ముఖ్యంగా గనుల తవ్వకంపై ఆంక్షలు విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం ఉత్తర్వులు జారీచేయడం ప్రజాభీష్టానికి లభించిన ఘనవిజయంగా చూడాలి. ప్రజల నిరంతర అప్రమత్తతే ప్రజాస్వామ్యానికి ప్రాణవాయువు వంటిదని నిరూపితం అయ్యింది. ర్యావరణ పరిరక్షణకూ అప్రమత్తతే రక్షణ కవచమని ఇప్పుడు ఆరావళి సాక్షిగా తేలిపోయింది. ఆరావళి పర్వతాలకు ప్రస్తుతానికైతే ముప్పు తప్పింది. కార్పొరేట్ గద్దలకు ప్రకృతి సంపదను దోచిపెట్టాలన్న దురాలోచన వెనుకపట్టు పట్టింది. ఎత్తు పేరుతో పర్యావరణాన్ని చిత్తు చేయాలన్న ఎత్తుగడ ప్రజాగ్రహం ముందు వీగిపోయింది. ఎడతెగని రైతుల పోరాటం ఫలితంగా కార్పొరేట్లకు సాగును కట్టుబానిసను చేయాలన్న పన్నాగం విఫలమై నల్లచట్టాలను వెనక్కి తీసుకున్నట్టే, దేశవ్యాప్తంగా రగులుతున్న ఆరావళి నిరసనలకు తలొగ్గి కేంద్రంలోని నరేంద్ర మోదీ సర్కార్ వెనక్కి తగ్గింది. ఎక్కడో పర్వతాలు, అడవులు.. ఎవరు తవ్వుకుంటే మనకేమి అనుకునే రోజులు కావివి. భూమి మీద ఉండే ప్రతి పుట్టా, చెరువూ దేనికవే పర్యావరణ వ్యవస్థలకు ఆయువుగా నిలిచి ప్రాణాధారాలుగా పనిచేస్తాయి. భూమి మీదున్న అతిపురాతన పర్వత శ్రేణుల్లో ఒకటైన ఆరావళికి ఉన్న ప్రాముఖ్యం తెలియంది కాదు. మన పురాణాలు, ఉపనిషత్తులు, వేదాల్లో దీని ప్రస్తావన ఉంది. మన దేశానికి ఉత్తరాన పెట్టని కోటగోడలా నిలుస్తున్న హిమాలయాల కంటే ఆరావళి పర్వతాలే పురాతనమైనవి. దాదాపు 700 కిలోమీటర్ల పొడవున్న ఈ పర్వతశ్రేణి మరో రకంగా రక్షణ దుర్గంలా నిలుస్తున్నది. పడమర నుంచి తూర్పు ప్రాంతాలకు వీచే వేడిగాలుల ప్రభావాన్ని తగ్గించి, థార్ ఎడారి విస్తరణకు లక్ష్మణరేఖలా నిలువడం దీని ప్రత్యేకత. రాజస్థాన్, హర్యానా, గుజరాత్, ఢిల్లీ రాష్ట్రాలను చల్లగా చూసే కొండదేవరగా ఆరావళిని చెప్పుకోవచ్చు. ఇక కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న దేశ రాజధాని ఢిల్లీకి ఊపిరితిత్తుల్లాంటివని చెప్పకతప్పదు. అలాంటి ఆరావళిని కార్పొరేట్, రియల్ ఎస్టేట్ శక్తులు ఇప్పటికే మైనింగ్‌తో, చెట్ల నరికివేతతో చెరపట్టి చేయాల్సిన నష్టం చేస్తూనే ఉన్నాయి. మరోవైపు ప్రాజెక్టుల పేరిట ప్రభుత్వాలు వేల ఎకరాల అడవులను ధ్వంసం చేస్తున్నాయి. దీనిని అడ్డుకోవాల్సిన కేంద్రం మరింతగా దూకుడు పెంచి తవ్వకాలకు అనుమతులు ఇవ్వాలని చూసింది. దీనివల్ల మనకు తీరని నష్టం అని తెలిసినా పట్టించుకోలేదు. ఆరావళిని అంగడి సరుకుగా మార్చేందుకు, గనుల తవ్వకానికి రాచబాట పరిచేందుకు మోదీ సర్కార్ చేసని ప్రయత్నాలపై దెబ్బపడింది. వంద మీటర్ల ఎత్తువరకు మాత్రమే తవ్వకాలు జరపొచ్చని, అంతకన్నా ఎత్తున్నవి మాత్రమే పర్వతాలుగా పరిగణించాలని వితండవాదం చేసింది. శాస్త్రీయ విధానంలో ఏది అడవి, ఏది కాదనేది తేల్చిచెప్పాల్సిన కేంద్రమే ఎత్తును బట్టి అనుమతులను నిర్ధారించడం ద్వారా పర్యావరణ విధ్వంసానికి తోవ వేసింది. ఎత్తును బట్టి ఆరావళి పర్వతాలకు నిర్వచనమిచ్చే విధానాన్ని సర్వోన్నత న్యాయస్థానం స్వయంగా నియమించిన కమిటీ కూడా తిరస్కరించింది. దాన్ని తోసిరాజని కోర్టు ముందు సలహాదారుగా ఆ ప్రతిపాదనే ఉంచి పక్కదారి పట్టించింది. అయితే ప్రజా ఉద్యమాన్ని కోర్టు కూడా పరిగణించింది. ఆరావాళి జోలికి వెళ్లవద్దని తేల్చింది. ఆయా రాష్ట్రాలకు సూచనలు చేసింది. ఇప్పుడు ఇదే స్ఫూర్తితో ఢిల్లీ కాలుష్యంపై ప్రజలు పోరాడాలి. అప్పుడే దేశానికి విముక్తి కలుగుతుంది. కాలుష్యంతో ఢిల్లీలో ఉండలేక పోతున్నానని కేంద్రమంత్రి నితిని గడ్కరీ స్వయంగా చెప్పడం చూస్తుంటే ఢిల్లీలో ఎంతటి దారుణ పరిస్థితులు ఉన్నాయో గమనించవచ్చు. అందువల్ల కేంద్రమే స్వయంగా రంగంలోకి దిగి రాజధానిని కాలుష్యం నుంచి బయటపడేసే మార్గాలను వెతకాలి.

# పరస్పర విమర్శలతో ఒరిగేదేమిటి?



హైదరాబాద్,తెలంగాణ రాజకీయాలు గమ్మత్తుగా సాగుతున్నాయి. కెసిఆర్ విమర్శలు, సిఎం రేవంత్ ప్రతి విమర్శలు జుగుప్సాకరంగా ఉన్నాయి. పరస్పర విమర్శలతో ప్రజలకు ఒరిగేదేమీ లేదు. రెండేళ్లు దాటినా కెసిఆర్, బిఆర్ఎస్ అవినీతి విచారణలు, చర్యల్లో ఒక్క అడుగు కూడా పడలేదు. విచారణల పేరుతో కాలయాపన తప్ప మరోటి కానరావడం లేదు. ఏతావాతా రాజకీయ నాయకుల అవినీతిని పరస్పరం భరించే ఒప్పందాలు జరిగాయా అన్న అనుమానాలు కలుగుతున్నాయి. మొత్తానికి విభజన తరవాత తెలంగాణ దగా పడ్డదన్నది నిజం. అన్నింటికి మించి తెలంగాణ వ్యవహారాలను ప్రజలనుంచి దూరం చేసి మూడు పార్టీలు ఆటలాడుతు న్నాయి. కాంగ్రెస్ మీద బిఆర్ఎస్, బిఆర్ఎస్ మీద కాంగ్రెస్, ఈ రెండింటిపై బిజెపిలు విమర్శలు చేసుకోవడం పరిపటిగా మారింది. ప్రజలకు మంచి చేద్దామన్న ఆలోచన ఒక్కరికీ లేదు. రాష్ట్రాన్ని అప్పులకుప్ప చేసి, మళ్లీమళ్లీ అప్పులు చేస్తున్నారు. అవసరం లేని ఖర్చులనే ప్రస్తావిస్తున్నారు. రాజకీయంగా తామే బలంగా ఉండాలని, తామే పాలించాలన్న ఆలోచన తప్ప మరోటి కానరావడం లేదు. కెసిఆర్ హయాంలో జరిగిన అప్పుల గురించి కెసిఆర్ కూడా మాట్లాడడం లేదు. జరిగిన తప్పులు, అప్పులకు ఎవ్వరు కూడా బాధ్యత వహించడం లేదు. ఇదంతా ప్రజల ఖర్మకు వదిలేశారు. ఇకపోతే కెసిఆర్ తనయ ఇప్పుడు స్వతంత్రంగా రాజకీయాలు చేస్తున్నారు. బిఆర్ఎస్ బహిష్కరించాక ఆమెకు ఇప్పుడి ప్పుడే జ్ఞానోదయం అవుతోంది. పదేళ్ల పాలనా కాలంలో తాను నిమిత్త మాత్రురాలినని అంటున్నారు. అన్నింటికి మంచి ఆమె ఎక్కడికి వెళ్లినా సమస్యలు స్వాగతిస్తున్నాయి. ఆమె ఇవన్నీ చూసి ఆశ్చర్యంతో పాటు క్షమాపణలు చెబుతున్నారు. తనతండ్రి పదేళ్ల కాలంలో బంగారు తెలంగాణ అన్నది జరగలేదని, గుర్తిస్తున్నందుకు ప్రజలకు కూడా తెలిసి వస్తోంది. పదేళ్ల పాలనో కెసిఆర్ తెలంగాణను ఆగం చేశారని, దోపిడీ చేశారని, ఎక్కడా అభివృద్ధి జరగలేదని కవిత పర్యటనల ద్వారా నిత్యం తెలుసుకుంటున్నాం. ఆనాడు నాకు ఎలాంటి అధికారం లేదని, ఒక్క టీచర్‌ను కూడాబదిలీ చేయించుకునే అవకాశం రాలేదని వలపోస్తున్నారు. బీఆర్ఎస్ నేతలపై ఆరోపణలు, ప్రత్యారోపణలతో ఆమె ఇప్పుడు ఒక సంచలన నాయకురాలిగా మారారు. అయితే ఆమె ఆరోపణలు, విమర్శలు తండ్రి పార్టీని మరింతగా దెబ్బతీస్తా యన్నది నిజం. అధికార కాంగ్రెస్ పార్టీకి అనుకూలంగా మారుతాయన్నది కూడా అంతే నిజం. కాళేశ్వరం నుంచి కూకట్‌పల్లి భూకబ్జాల దాకా తీవ్ర ఆరోపణలు చేస్తూ ఆమె ఒక సంచలన నాయకురాలిగా మారి పోయారు. బిఆర్ఎస్‌లో ఉన్న మంత్రులు, ఎమ్మెల్యేల భూదందాలు, అక్రమాలపై విరుచుకు పడుతున్న తీరుతో ఆమె ప్రజల్లో మళ్లీ కొంత సానుభూతిని పొందే ప్రయత్నాల్లో సాగుతున్నారు. అయితే లిక్కర్ స్కామ్‌తో కవిత పొలిటికల్ కెరీర్‌కు కాస్త ఇబ్బంది ఏర్పడింది. అప్పటికే కేసీఆర్ పదేండ్ల పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఏర్పడింది. ఇలా ఎవరికి వారు స్వార్థ రాజకీయాలకు తెలంగాణను బలి తీసుకున్నారు. అందుకేనేమో ఇప్పుడు కవిత వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి. మొదటి నుంచి కూడా పార్టీలో తనకు ప్రాధాన్యమిచ్చేవారు కాదని కవిత చెపుతోంది. ఎంపీగా ఉన్నపుడు తనను నిజామాబాద్‌కు మాత్రమే పరిమితం చేశారని చెపుతోంది. నేటి కాలంలో వారసత్వాలు లేని రాజకీయాలు నడవడం లేదు. కెసిఆర్ కూడా అందుకు అతీతుడు కాదని నిరూపించుకున్నారు. బీజేపీ, కమ్యూనిస్టులు మాత్రమే ఇందుకు భిన్నంగా ఉంటారు. కిందిస్థాయిలో ఆ పార్టీ నేతల వారసలు కూడా ఇప్పుడిప్పుడు మెల్లగా బయటకు వస్తున్నారు. భారతదేశంలో ఏ పార్టీ వారసత్వ రాజకీయాలకు అతీతం కాదు. కాకపోతే, ఒకే కుటుంబంలో కొడుకు, కూతురు, మేనల్లుడిని ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకుని వచ్చారు. తన బందు గణాన్ని కూడా తెచ్చి పెట్టుకున్నారు. తన కులం వారికి అగ్ర తాంబూలంఇచ్చారు. ఎక్కడెక్కడో ఉన్న వారిని ముందువరసలో పెట్టారు. ఇలా మొత్తం ఒకే కులం వారు గత పదేళ్లపాటు డామినేషన్ చేశారు. ఇప్పుడు అదే దెబ్బకొట్టింది. అదే అధికారాన్ని దూరం చేసింది. చివరకు కెసిఆర్‌కు వారసుల నుంచే సమస్యలు ఎదురవుతున్నాయి. కేసీఆర్ అడ్డదిడ్డంగా సంపాదించినర సంపదలో వాటా వివాదం కారణంగానే కవితను బయటకు పంపారని అంటున్నారు. సిఎం రేవంత్ రెడ్డి అయితే పదేపదే ఇదే చెబుతున్నారు. గత ఎన్నికల్లో నిజామాబాద్ నుంచి తమ పార్టీవారే తనను కావాలని ఓడించారని ఇప్పుడు కవిత చెపుతోంది. మంచి వక్తగా పేరున్న కవిత బాగా సంపాదించారన్న ఆరోపణలు కూడా ఉన్నాయి. తనకేమీ తెలియదని ఇప్పుడు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఆమెను దగ్గరగా చూసిన వారు మాత్రం నిజమేమిటో తెలుసుకోగలరు. లిక్కర్ కేసు ద్వారా ప్రతిష్ట దెబ్బతిన్నదన్నది నిజం. తిరిగి పరువు కాపాడుకోవాలనే ఆరాటం కవితలో బాగా కనిపిస్తోంది. అందుకే జాగృతి జనంబాట పట్టారు. రాజకీయాల్లో అపవాదుకు గురైనపుడు, కుటుంబం దూరం పెడుతున్నపుడు, తనకు మిగిలింది రాజకీయ మార్గమే అని కవిత భావించి ఉంటుంది. ఆమె చేపట్టిన తిరుగుబాటు రాజకీయం తండ్రి పార్టీని దెబ్తీస్తుందని తెలిసినా , తన రాజకీయ ఎజెండా కోసం ఆమె దేనినీ లెక్క చేయడం లేదని కనిపిస్తోంది. కాళేశ్వరంలో జరిగిన అవినీతికి హరీశ్‌రావే కారణంగా ఆమె చేసిన విమర్శలు సంచలనంగా మారాయి. ఎవ్వరినీ వదలకుండా అవినీతి ఆరోపణలు చేస్తున్నారు. తాను మాత్రం కడిగిన ముత్యం అని చెప్పుకునే ప్రయత్నం కూడా చేస్తున్నారు. కెసిఆర్ కూతురుగా రాజకీయాల్లోకి వచ్చిన కవిత ఇప్పుడు తనకుతానుగా రాజకీయంగా నిలదొక్కుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె ఏమేరకు విజయం సాధిస్తారన్న చూడాలి. అయితే తెలంగాణ వేదికగా రాజకీయ పార్టీలు విన్యాసం చేస్తున్నాయి. తెలంగాణ విడివడ్డ తరవాత కూడా పెద్దగా ఆశించిన ప్రయోజనం మాత్రం నెరవేరలేదు. రాజకీయాలు వారి సౌలభ్యం కోసం మారాయి. ప్రజలు మాత్రం పావులుగా మారారు. ఈ తరహా రాజకీయాలను దూరం చేయాలంటే ప్రజలు చైతన్యం కావాలి. దగుల్బాజీ రాజకీయాలను దునుమాడాలి.

# అల్లకల్లోల ప్రపంచంలో అద్వితీయమైన చైనా



సోవిట్ సోషలిస్ట్ నమూనా పతనం అనేది చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి)లో పెద్ద చర్చకు దారితీసింది. సిపిసి నాయకత్వం సోవియట్ మోడల్‌ని అనుసరించ కుండా మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని, చైనాస్థానిక పరిస్థితులకు వర్తింపజేసే సోషలిస్టు నమూనాను ఎంచుకుంది. "చైనా లక్షణాలతో కూడిన సోషలిజం" అనే విధానాన్ని ఎంచుకుంది. అంటే మార్క్సిజం- లెనినిజం సిద్ధాంతం వెలుగులో చైనా దేశీయ లక్షణాలతో కూడిన సోషలిజం నమూనాను అమలు చేయాలని సిపిసి నిర్ణయించు కుంది. భారతదేశానికి స్వాతంత్రం 1947 ఆగస్టు 15న వచ్చింది. పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా 1, అక్టోబర్ 1949లో ఏర్పడింది. మన స్వాతంత్రం తర్వాత రెండు సంవత్సరాల 35 రోజులకు చైనా ప్రజా రిపబ్లిక్ ఏర్పడింది. రెండు దేశాలకు అనేక పోలికలు ఉన్నాయి. కానీ చైనా అమెరికాను సవాలు చేస్తుంది. ప్రపంచ జీవన వ్యయ పోలిక (పిపిపి)ని అనుసరించి అమెరికాను చైనా అధిగమించింది. అనేక రంగాలలో అమెరికాను చైనా దాటిపోయింది. కానీ భారత్‌లో దారిద్ర్యం, ఆకలి, అన్నదాతల ఆత్మహత్యలు, వ్యవసాయ సంక్షోభం, నిరుద్యోగం, కాలుష్యం, పౌష్టికాహార లోపం, వెనక బాటుతం, విద్యారంగ దుస్థితి, పెచ్చరిల్లుతున్న నేరాలు, అనేక అసమానతలు తాండవిస్తున్నాయి. చైనా అత్యున్నత నాయకుడు డెంగ్ సియావో పింగ్ 1978లో ప్రారంభించిన "ఓపెనింగ్ అప్" కీలకమైన సంస్కరణలు చైనా సమగ్ర స్వరూపాన్ని సమూలంగా మార్చి వేశాయి. చైనా 85 కోట్ల మంది ప్రజల దారిద్ర్యాన్ని రూపుమాపింది. వారి ఆర్థిక సమగ్ర జీవన పరిస్థితులని సమూలంగా మార్చింది. ఇది ప్రపంచ మానవ అభివృద్ధిలో అసాధారణమైనది. 30 ఏండ్ల క్రితం ఆదేశ జనాభాలో 66శాతం ప్రజలు అత్యంత పేదరికంలో జీవించారు. అలాంటిది 2020 నాటికి చైనా ఆ దేశంలోని దారిద్ర్యాన్ని సంపూర్ణంగా నిర్మూలిం చింది. మొత్తం ప్రపంచ మానవాళి చరిత్రలో చైనా ప్రజల పేదరిక నిర్మూలన చారిత్రాత్మకమైన ఘట్టం. ఆశ్చర్యకరమైనదనీ ప్రపంచ ప్రముఖులు వర్ణిస్తున్నారు. అనేక దశాబ్దాలుగా ఆటోమొబైల్‌ను ఏలిన అమెరికా పచ్చిమయూరప్ ఆటో ఇండస్ట్రీ చైనా పోటీకి బీటలు బారుతోంది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో..స్టీల్ ఉత్పత్తిలో 53.9శాతం, సిమెంట్ ఉత్పత్తిలో 51.1శాతం, ఫెర్టిలైజర్స్, కెమికల్స్ లో 20- 30శాతం ఒక్క చైనాయే ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలోనీ హై స్పీడ్ రైల్ లైన్ మొత్తంలో ఒక్క చైనా 66శాతం కలిగి ఉ ంది. ప్రపంచ భారీ ఓడల నిర్మాణంలో చైనా ఒకటే 51శాతం నిర్మిస్తోంది. ప్రపంచ సముద్ర జలాల్లోకి వెళ్లే కొత్త భారీ ఓడల్లో సగం చైనా నిర్మించినవే. అవి కూడా ఏ దేశం నిర్మించనంత చౌకగా, నాణ్యంగా, గొప్ప సాంకేతికతతో చైనా నిర్మిస్తున్నది. రెండు దశాబ్దాల క్రితం ఓడల నిర్మాణంలో చిరునామాలేని చైనా దెబ్బకు అమెరికా పశ్చిమ యూరప్ షిప్ బిల్డింగ్ పరిశ్రమ కూలిపోగా, సౌత్ కొరియా జపాన్‌లు ఎదురీదుతున్నాయి. ఇండియా ఎక్కడో అడుగున ఉ ంది. సముద్ర జల రవాణాను వ్యూహాత్మకంగా విప్లవాత్మకంగా మార్చింది చైనా. అమెరికాను చైనా అనేక రంగాల్లో అధిగమించింది. మొత్తం ప్రపంచ ఉత్పత్తిలో 30 శాతం కేవలం చైనాదే అంటే ఆ దేశ ప్రగతి ఎంత వేగంతో సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంలో ఆధిపత్యంలేని, అందరికీ సమానమైన న్యాయమైన బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థ నిర్మాణం కొరకు, మంచి మార్పుల కోసం ఒక ప్రభల శక్తిగా చైనా నిలబడింది. అమెరికా ఇంగ్లాండ్ పశ్చిమ యూరోప్, జపాన్ లాంటి ఆధిపత్య వలసవాదానికి పూర్తి వ్యతిరేకమైన ఒక బలమైన మృదువైన శక్తిగా దక్షిణ ఆఫ్రికా ఖండ, దక్షిణ అమెరికా, ఆసియా, పశ్చిమ ఆసియా, సెంట్రల్ ఆసియా దేశాలతో కలిసి నిలబడింది. మానవీయ జీవన విలువల ప్రమాణాన్ని నిర్ణయించడం కోసం ప్రపంచంలో ఎక్కడా లేని "సోషల్ క్రెడిట్ సిస్టం(ఎస్‌సిఎస్)" ను చైనా నెలకొల్పింది. 700 మిలియన్ల ఫేషియల్ రికగ్నిషన్‌ను గుర్తించే శక్తివంతమైన కెమెరాలు దేశ ప్రజలతో పాటు, ఇతర దేశాల పర్యాటకులను పర్యవేక్షించి నియంత్రిస్తున్నాయి. చైనా తన ప్రజల్లో సామాజిక సామరస్యాన్ని నెలకొల్పుతున్నది. నేరాల రేటు గణనీయంగా పడిపోయింది. గత రెండు దశాబ్దాలుగా ప్రపంచంలో సురక్షితమైన దేశంగా గత రెండు దశాబ్దాల్లో చైనా మొదటి శ్రేణిలో నిలుస్తున్నది. 1990లో చైనా 170 పట్టణాలను కలిగి ఉండేది. నేడు అవి 700లకు పెరిగాయి. 17 మెగా సిటీలున్నాయి. షేన్జెన్ అనే ఒక చిన్న చేపలు పట్టే పట్టణం నేడు ప్రపంచానికి సిలికాన్ వాలీగా మారింది. డెంగ్ సియాఓ పింగ్ 'ఓపెనింగ్ అప్' చేసిన నాలుగు దశాబ్దాలలోనే చైనాలో ప్రపంచ మానవాళిని సమ్మోహన పరిచేలా, కండ్లు మిరుమిట్లు గొలిపేలా, అద్భుతమైన అభివృద్ధి జరిగింది. వీటన్నింటికీ ఒక్కటే సమాధానం. చైనాను అన్ని రంగాలలో ప్రపంచంలోనే శక్తివంతమైన దేశంగా తీర్చిదిద్దాలనే దృఢమైన సంకల్పం గల విప్లవాత్మక నాయకత్వానికి ఆ కీర్తి దక్కుతుంది. డెంగ్ సియాఓ పింగ్ "ఓపెనింగ్ అప్"తో, అమెరికా, పశ్చిమ, వివిధ దేశాల పెట్టుబడి దారులు చౌకైన శ్రమను కొల్లగొట్టడంకై తమ పరిశ్రమలన్నీ చైనాకు తరలించాయి. షరతు ప్రకారం కీలక సాంకేతికతలన్నీ చైనా గుప్పిట్లోకి వచ్చాయి. చైనా ప్రపంచ ఫ్యాక్టరీగా మారింది. ప్రపంచ ప్రజలు వినియోగించే 30శాతం పైగా వస్తువులు చైనా దేశానివే అంటే అతిశయోక్తి కాదు. చైనా విద్యుత్ వినియోగం చూస్తే కండ్లు తిరిగిపోతాయి. అమెరికా, యూరోపియన్ యూనియన్, ఇండియా, రష్యా, జపాన్ అన్నీ కలిసి ఎంత వినియోగిస్తాయో అంతకంటే ఎక్కువ కరెంటును చైనా వినియోగిస్తుంది. చైనా హైడ్రో పవర్ దాని పరిశ్రమకు వెన్నెముకగా ఉంది. 436 గిగా వాట్ కెపాసిటీ ప్రపంచంలోనే అతి పెద్దదిగా ఉంది. త్రీ గార్జెస్ డ్యామ్ ఒకటే 22,500 మె.వా. కాలుష్య రహిత విద్యుత్తును ఉత్పత్తి చేస్తున్నది. ప్రపంచంలోనే అతిపెద్ద, తన రికార్డును తానే తిరగరాస్తున్న చైనా త్రీ గార్జెస్ కంటే రెండింతల పెద్ద "మెడోగ్ హైడ్రో పవర్ స్టేషన్" (60 వేల మె.వా.)నిర్మాణం ప్రారంభించింది. ప్రకృతి హితమైన "నూతన ఉత్పత్తి శక్తులను నిర్మించడమే చైనా ఏకైక లక్ష్యంగా ఉ ంది". బొగ్గు విద్యుత్ వినియోగం ఇప్పటికీ గణనీయమైన 58శాతం అయినప్పటికీ, వేగంగా బొగ్గు ఆధారిత విద్యుత్తును తగ్గిస్తున్నది. న్యూక్లియర్ ఫ్యూజన్(కేంద్రక సంలీనం)తో సూర్యుడిలోని స్వచ్ఛమైన విద్యుత్తు ఉత్పత్తి ప్రక్రియను ఒక ఫ్యాక్టరీ రూపంలో చైనాలో నిర్మిస్తోంది. అది పూర్తయితే ప్రకృతికి హానిలేని అనంతమైన విద్యుత్తు అందుబాటులోకి వస్తుంది. ఇలా చైనా నూతన ఉత్పత్తి శక్తులను భారీ ఎత్తున అభివృద్ధి చేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ భవిష్యత్తు అవసరాలకు సరిపడా విద్యుత్తును ఉత్పత్తి చేయడం చైనా లక్ష్యంగా పెట్టుకుంది. 2025కు 200 టెర్రావాట్ హవర్, 2030 కల్లా 600 టెర్రావాట్ విద్యుత్తును ఉత్పత్తి చేయాలని చైనా లక్ష్యం. ఒక్క 2024 లోనే చైనా 429 గిగా వాట్ విద్యుత్తును కొత్తగా చైనా ఉత్పత్తి చేసింది. కానీ ఇదే సమయంలో అమెరికా 51 గిగా వాట్ విద్యుత్తును మాత్రమే ఉత్పత్తి చేసింది. ఆర్టిఫిషియల్ఇంట లిజెన్స్(ఎఐ)డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లకు నిరంతర విద్యుత్తు భారీ ఎత్తున అవసరం. ఏఐ రేసులో అమెరికా కంటే అన్ని దేశాల కంటే ముందున్న చైనా, గెలుపు దిశగా వేగంగా అడుగులు వేస్తున్నది.

# జనంలోకి వెళ్లాలనుకుంటున్న కేసీఆర్..

హైదరాబాద్,ఇప్పటిదాక ఒక లెక్క. ఇక నుంచి మరో లెక్క. అడ్డగోలుగా మాట్లాడుతాం.. నోటికొచ్చినట్లు వాగుతాం.. అంటే కుదరదు. ప్రజాక్షేత్రంలోకి లాగుతాం. మీ సంగంతేంటో చూస్తామని..కాంగ్రెస్ సర్కార్‌కు వార్నింగ్ ఇచ్చారు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్. కాంగ్రెస్ సర్కార్‌కు కావాల్సిన టైమ్ ఇచ్చామని..ఇక పోరు బాటే అంటూ యుద్ధం ప్రకటించారు. దాదాపు రెండేళ్ల పాటు ఎర్రవల్లి ఫామ్‌హౌజ్‌కే పరిమితమైన గులాబీ బాస్ ఇకపై ఫుల్ యాక్టీవ్‌గా పాలిటిక్స్‌లో ఉంటానని చెప్పుకొచ్చారు. రెండేళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు సంసిద్ధం అవుతున్నారు. ఇందులో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లా ఉమ్మడి మహబూబ్ నగర్‌ను ఎంచుకున్నారు కేసీఆర్. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, కృష్ణా జలాలను ఏపీకి తరలించే కుట్ర జరుగుతోందని ఆరోపిస్తున్న కేసీఆర్..ఆందోళనలు, సభలు, సమావేశాలకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. కాంగ్రెస్ పాలన తెలంగాణకు శాపంగా మారిందని కేసీఆర్ శాపనార్థాలు పెట్టడం, హస్తం పార్టీ సర్కార్ అన్ని రంగాల్లో విఫలమైందని ఆరోపించి ఇకపై ప్రజల్లోకి వెళ్తామని యుద్ధం ప్రకటించడంతో రాజకీయం వేడెక్కింది. రెండేళ్లుగా స్తబ్దుగా ఉన్న బీఆర్ఎస్ క్యాడర్‌లో కేసీఆర్ రాక ఉ త్సాహాన్ని నింపింది. ఇక పంచాయతీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఆశించిన దాని కంటే మెరుగైన ఫలితాలు రావడంతో..ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో ఇంకా సత్తా చాటొచ్చన్న నమ్మకం పెరిగింది. కేసీఆర్ చేసిన కామెంట్స్ అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం మధ్య డైలాగ్‌వార్‌కు దారితీశాయి. బీఆర్ఎస్, కేసీఆర్ చరిత్ర ఇక ముగిసిన కథే అంటున్నారు సీఎం రేవంత్. తాను రాజకీయాల్లో ఉన్నంతకాలం కేసీఆర్ కుటుంబం అధికారంలోకి రాదని, రానివ్వబోనని కొడంగల్ సాక్షిగా శపథం చేశారు. 2029 ఎన్నికల్లో 119 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 80 సీట్లు, 153 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే 100కుపైగా సీట్లు గెలుచుకుంటాం..ఇది తన సవాల్ రాసిపెట్టుకోండి అంటూ గర్జించారు రేవంత్.

### గులాబీ పార్టీ నేతల దూకుడుకు బ్రేకులు వేసేలా స్కెచ్

అందుకు అనుగుణంగానే కేసీఆర్‌తో పాటు గులాబీ పార్టీ నేతల దూకుడుకు బ్రేకులు వేసేలా పథకం రచిస్తున్నారన్న చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ పాలనలో స్కామ్‌లు జరిగాయంటూ కేసులు, విచారణలను స్పీడప్ చేస్తోంది కాంగ్రెస్ సర్కార్. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో సిట్ ఆఫీసర్లు కేసీఆర్ సహా కేటీఆర్, హరీశ్‌రావులకు నోటీసులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. రెండేళ్ల తర్వాత జనంలోకి వచ్చేందుకు రెడీ అవుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఇది ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందన్న టాక్ వినిపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించిన కేసీఆర్‌కు.. సీఎం రేవంత్ రెడ్డి ఫోన్ ట్యాపింగ్ కేసుతో బ్రేకులు వేయబోతున్నారన్న చర్చ సాగుతోంది. అంతే కాకుండా ఈ నెల 29 నుంచి ప్రారంభవుతున్న అసెంబ్లీ సమావేశాల్లో నదీజలాలు, ప్రాజెక్టుల అంశం ప్రధానంగా చర్చకు వచ్చే అవకాశం ఉంది. కృష్ణా జలాలపై బీఆర్ఎస్ ప్రభుత్వం ఏపీతో కుదుర్చుకున్న ఒప్పందం తెలంగాణకు శాపంగా మారిందని చెప్పేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్, ఫార్ములా ఈ కారు రేస్ వంటి అంశాలను సభలో ప్రస్తావనకు తెచ్చేందుకు రేవంత్ సర్కార్ ప్లాన్ చేస్తోందట. అయితే కేసీఆర్‌కు నోటీసులు కొత్త కాదని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కుంగిపోవడంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ముందు హాజరై డీటేయిల్డ్‌గా సమాధానం ఇచ్చిన విషయాన్ని మర్చిపోవద్దంటున్నారు బీఆర్ఎస్ నేతలు. ఒకవేళ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై కేసీఆర్‌కు సిట్ నోటీసులు ఇస్తే ఆయన విచారణకు హాజరవుతారా లేదా అన్న అంశంపై ఇంకా స్పష్టత లేదంటున్నాయి పార్టీ వర్గాలు. ఫార్ములా ఈ కారు రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రెండుసార్లు ఏసీబీ విచారణకు హాజరయ్యారు. కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి ఇవ్వడంతో అరెస్ట్ తప్పదన్న ప్రచారం జరుగుతోంది. ఇదంతా రాజకీయ కక్ష సాధింపు చర్య అన్నది కారు పార్టీ నేతల వాదన. కేసులు విచారణలు తమను చికాకు పెడుతున్నాయన్న అసహనం బీఆర్ఎస్ వర్గాల్లో కనిపిస్తోంది. కొత్త సంవత్సరంలో ప్రజల్లోకి వెళ్లాలనుకున్న గులాబీ దళపతి కేసీఆర్ దూకుడుకు..బ్రేకులు వేసేందుకు రేవంత్ పక్కా స్కెచ్ రెడీ చేశారన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. రేవంత్ గేమ్‌కు కేసీఆర్ దగ్గరున్న ప్లాన్ ఏంటో చూడాలి మరి.

# అందుకే ఈ అస్త్రం వదిలారా?

హైదరాబాద్, తెలంగాణ పాలిటిక్స్‌లో పార్టీ జంపింగ్ ఎమ్మెల్యేల ఎపిసోడ్ కీలకంగా మారింది. ఫిరాయింపు ఆరోపణలు ఫేస్ చేస్తున్న పదిమంది ఎమ్మెల్యేల్లో ఐదుగురి విషయంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ ఇప్పటికే నిర్ణయం ప్రకటించారు. పదిమంది ఎమ్మెల్యేలలో ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారారనడానికి సరైన ఆధారాలు లేవని స్పీకర్ పిటిషన్ కొట్టేశారు. మరో ఐదుగురు ఎమ్మెల్యేల విషయంలో మాత్రం ఎటువంటి తీర్పు ప్రకటించలేదు. అయితే ఆ ఐదుగురిలో ఒకరైన దానం నాగేందర్ ఇంత వరకు స్పీకర్ నోటీసులకు వివరణ ఇవ్వలేదు. ఒకపక్క కేసు విచారణ సీరియస్‌గా జరుగుతున్న టైమ్‌లోతాను కాంగ్రెస్ పార్టీలోనే ఉన్నానంటూ దానం నాగేందర్ ప్రకటించడం చర్చనీయాంశంగా మారింది. దానం నాగేందర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ పార్టీలోకి జంప్ చేశారు. అంతేకాదు పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ బీ-ఫామ్ మీద సికింద్రాబాద్ ఎంపీగా పోటీ చేశారు. దీంతో దానం విషయంలో ఫిరాయింపు వివాదం కీలకంగా మారింది. మిగతా తొమ్మిది మంది ఎమ్మెల్యేల కథ వేరు. దానం మ్యాటర్ మరింత స్పెషల్‌గా మారింది. దానం పార్టీ మారారని అనడానికి కాంగ్రెస్ బీ ఫామ్‌పై పోటీ చేయడమే కీలక ఆధారం. ఈ నేపథ్యంలో స్పీకర్ నోటీసులకు కూడా ఇప్పటి వరకు ఎలాంటి వివరణ ఇవ్వలేదు. తాను పార్టీ మారారని చెప్పడానికి బలమైన ఆధారాలు ఉండడంతో ఏదో ఒక రోజు చర్యలు తప్పవని దానం భావిస్తున్నట్లు సమాచారం. ఇదే అంశాన్ని ఇటు రాష్ట్రంలో, అటు ఢిల్లీలో పార్టీ పెద్దల దగ్గర దానం ప్రస్తావించినట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు రెడీగా ఉన్నానని చెబుతూనే పార్టీ పెద్దల దగ్గర దానం ఒక కండీషన్ పెట్టారట.

### కచ్చితంగా మంత్రివర్గంలో ఛాన్స్ ఇవ్వాలని కోరారా?

కాంగ్రెస్‌లో చేరేటప్పుడే దానం తన మనసులోని మాటను పార్టీ పెద్దల ముందు ఉంచారట. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసేటప్పుడు కూడా ఇదే కండిషన్‌తోనే పోటీ చేశారట. లోక్‌సభ ఎన్నికల్లో ఓడితే..కచ్చితంగా మంత్రివర్గంలో ఛాన్స్ ఇవ్వాలని కోరారట. లేటెస్ట్‌గా ఫిరాయింపుల ఎపిసోడ్ సీరియస్‌గా మారడంతో ఢిల్లీ వెళ్లి పార్టీ పెద్దలతో సంప్రదింపులు చేశారు. తనకు మంత్రి పదవి ఇస్తే రాజీనామా చేసి మళ్ళీ పోటీ చేసి గెలుస్తానని పార్టీ పెద్దలకు చెప్పారట. దానం ఈ విషయం చెప్పి దాదాపు నెల రోజులు గడుస్తున్నా.. పార్టీ అధిష్టానం ఇప్పటివరకు ఎలాంటి డెసిషన్ తీసుకోలేదట. ఇక ఆలస్యం చేస్తే తనకి ఇబ్బంది తప్పదని గ్రహించిన దానం.. తనకి తాను మీడియా ముందుకు వచ్చి ఓపెన్ అయ్యారట. తాను కాంగ్రెస్‌లోనే కొనసాగుతున్నానని దానం కావాలనే స్టేట్‌మెంట్ ఇచ్చినట్లు చర్చ జరుగుతోంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి కాంగ్రెస్ బీఫామ్‌పై పోటీ చేసిన ఆధారం ఉండటంతో దానంపై స్పీకర్ చర్యలు తీసుకుని..మిగిలిన నలుగురు ఎమ్మెల్యేల పిటిషన్లను కొట్టివేస్తారని ప్రచారం జరుగుతోంది. అయితే ఎట్టకేలకు దానం నాగేందర్ తనకు తాను కాంగ్రెస్‌లో ఉన్నానని ప్రకటించడంతో స్పీకర్ నిర్ణయం తీసుకోక తప్పదన్న టాక్ వినిపిస్తోంది.

# వివాహితకు వేధింపులు...

నిజామాబాద్,వివాహితను వేధిస్తున్న కాంగ్రెస్ నాయకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాన్సువాడలో ఓ మహిళను ఏనుగు రవీందర్ రెడ్డి ప్రధాన అనుచరుడైన దేవేందర్ రెడ్డి కొంతకాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఈ విషయం సదరు మహిళ ఆమె భర్తకు చెప్పడంతో దేవేందర్ రెడ్డికి దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ క్రమంలో దేవేందర్ రెడ్డిపై ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీతో పాటు లైంగిక వేధింపుల కేసు నమోదు చేశారు. బాన్సువాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పనిచేస్తున్న మహిలను దేవేందర్‌రెడ్డి వేధింపులకు గురిచేస్తున్నాడు. నెలరోజులుగా దేవేందర్‌రెడ్డి వేధింపులు భరించలేక సదరు మహిళ తన భర్తకు విషయం చెప్పింది. గురువారం కూడా మహిళను దేవేందర్‌రెడ్డి వేధిస్తుండగా ఆమె భర్త అక్కడికి చేరుకొని అతడిని పట్టుకున్నాడు. తీవ్ర ఆగ్రహం చెందిన ఆయన దేవేందర్‌రెడ్డిని దవాఖాన నుంచి నడిరోడ్డుపై చెప్పులతో కొడుతూ పోలీసు స్టేషన్ వరకు తీసుకెళ్లి, పోలీసులకు అప్పగించాడు. బాధితురాలిని, ఆమె భర్తను కాంగ్రెస్ నాయుకుడు బుజ్జగించే ప్రయత్నం చేసినా ఫలితంలేకపోయింది. సాయంత్రం బాధిత కుటుంబ సభ్యులు పోలీసుస్టేషన్‌కు వెళ్లినట్టు సమాచారం.

# పర్యావరణవేత్తలే పరిష్కారం కనుగొనాలి

న్యూఢిల్లీ, దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం రోజురోజుకూ పెరుగుతోంది. శుక్రవారం ఉదయం కూడా గాలి నాణ్యత సూచిక ప్రమాదకర స్థాయిలో నమోదైంది. అనేక ప్రాంతాల్లో ఏక్యూఐ లెవెల్స్ 400కిపైగా నమోదయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాజధాని నగరంలో తీవ్ర కాలుష్యంపై భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కాలుష్య సంక్షోభానికి పర్యావరణ నిపుణులు సమర్థవంతమైన పరిష్కారాన్ని కొనుగొంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఓ న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ.. 'ఢిల్లీని పీడిస్తున్న వాయు కాలుష్య సమస్యను నివారించడానికి స్వల్పకాలిక ఉపశమనం కలిగించే విధానాల కంటే.. దీర్ఘకాలిక పరిష్కారం కోసం చర్యలు అవసరం. ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారుతున్న ఈ వాయు కాలుష్య సమస్యకు నిపుణులు పరిష్కారం కనుగొంటారని నాకు నమ్మకం ఉందని అన్నారు. సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శుక్రవారం ఉదయం రాజధాని నగరంలో గాలి నాణ్యత గణనీయంగా క్షీణించింది. ఉదయం 8 గంటల ప్రాంతంలో నగరంలో ఓవరాల్ ఏక్యూఐ లెవెల్స్ 305గా నమోదైంది. అత్యధికంగా ఆనంద్ విహార్ ప్రాంతంలో గాలి నాణ్యత సూచిక 390గా నమోదైంది. బవానాలో 379, నరేలా ప్రాంతంలో 356, ఆర్కే పురంలో 320గా ఏక్యూఐ నమోదైంది. నగరంలోని మరికొన్ని ప్రాంతాల్లో గాలి నాణ్యత మెరుగ్గా నమోదైంది. ఔఃూఎః ద్వారకలో 253, అరబిందో మార్గ్ (258), మందిర్ మార్గ్ (234), ఎఉఎ విమానాశ్రయం ః3 (239)గా గాలి నాణ్యత నమోదైంది.

# జగన్ కు మేలేనా!?

హైదరాబాద్,తెలుగు రాష్ట్రాల్లో మాజీ ముఖ్యమంత్రులైన వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి, బీఆర్ఎస్ బాస్ కేసీఆర్ మధ్య బలపడుతున్న బంధం రాజకీయంగా ఆసక్తిరేపుతోంది. ఇద్దరూ ముఖ్యమంత్రులుగా ఉన్నప్పుడే వీరి మధ్య స్నేహ బంధం మొగ్గతొడిగినా.. తాజా పరిణామాల మధ్య ఒకరికొకరు సహకరించుకోవాల్సిన పరిస్థితులతో రాజకీయాలలో ఎటువంటి మలుపులు చోటుచేసుకోనున్నాయనే ఉత్కంఠ రేగుతోంది. ప్రస్తుతం పొత్తు రాజకీయాలకు దూరంగా ఉంటున్న జగన్, కేసీఆర్ భవిష్యత్తులో పొత్తు పెట్టుకుని పనిచేస్తారా? లేక ఒకరికొకరు అండగా నిలుస్తూ ఎవరికి వారే రాజకీయంగా పావులు కదుపుతారా? అనే చర్చ ఎక్కువగా జరుగుతోంది. రెండు రోజుల క్రితం ఏపీ మాజీ సీఎం జగన్ రెడ్డి జన్మదినం సందర్భంగా తాడేపల్లిలో వైసీపీ కార్యాలయం వద్ద వేసిన పోస్టరులో కేసీఆర్, కేటీఆర్ ఫొటోలు పెట్టడం, అదేవిధంగా ఎన్నడూ లేనట్లు హైదరాబాద్ లో కూడా జగన్ పుట్టినరోజు వేడుకలు నిర్వహించడం కూడా రాజకీయంగా ఆసక్తికరంగా మారిందని అంటున్నారు. తాజా పరిణామాలతో మాజీ సీఎంలు జగన్, కేసీఆర్ మధ్య స్నేహం బలపడిందనే సంకేతాలు కనిపిస్తున్నాయని అంటున్నారు. దాదాపు రెండేళ్ల విరామం తర్వాత మీడియాతో సుదీర్ఘంగా మాట్లాడిన తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్.. తన స్వరాష్ట్రం కన్నా ఏపీ వ్యవహారాలపై ఎక్కువగా మాట్లాడటం కూడా కొత్త సందేహాలకు తావిస్తోందని అంటున్నారు. అయితే ఈ సరికొత్త రాజకీయం వల్ల ఎవరికి ప్రయోజనం అన్న చర్చ జరుగుతోంది. ఏపీలో అధికార పార్టీ టీడీపీని తీవ్రంగా వ్యతిరేకించే కేసీఆర్.. ఎక్కువగా ఏపీ వ్యతిరేక భావ జాలంలోనే రాజకీయాలు చేస్తూ వస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీని వెనకేసుకు రావడమో లేక ఆ పార్టీని బలపరచడమో వల్లనో కేసీఆర్ కు రాజకీయంగా ఏమైనా ప్రయోజనం ఉంటుందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తెలంగాణలో రాజకీయంగా ఎదురీదుతున్న బీఆర్ఎస్ దేశంలో తటస్థ రాజకీయాలను ఎంచుకుంది. ఇండి కూటమిలోని కాంగ్రెస్ పార్టీకి విపక్షంగా ఉన్న బీఆర్ఎస్.. అటు బీజేపీకి దగ్గర కాలేకపోతోంది. ఇక మూడో ప్రత్యామ్నాయం కూడా లేక తెలంగాణలో ఒంటరిగా మిగిలిపోయింది. ఇటు ఏపీలో కూడా వైసీపీ ఇదే పరిస్థితి ఎదుర్కొంటోంది. ఎన్డీఏ కూటమి వల్ల అధికారం కోల్పోయిన వైసీపీ.. రాష్ట్రాన్ని విభజించిన కాంగ్రెస్ తో చేతులు కలిపే సాహసం చేయలేకపోతోంది. అదే సమయంలో రాష్ట్ర విభజనకు కారణమైన బీఆర్ఎస్ పార్టీతో కలిసి నడిచి ప్రయత్నంపైనా తర్జనభర్జన పడుతోందని అంటున్నారు. టీడీపీ వ్యతిరేక భావజాలంతో ఇరుపార్టీల కేడర్ ఒక్కటిగా మాటలు ఆడుతున్నా.. రాజకీయంగా ఎదురయ్యే పరిణామాలను అంచనా వేసిన తర్వాతే.. బీఆర్ఎస్ తో బహిరంగ దోస్తీ చేయాలని పార్టీ నేతలు సూచిస్తున్నారు. పార్టీ అధినేత జగన్ రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా వేసిన ఫ్లెక్సీపై రాష్ట్రంలో ఎలాంటి చర్చ జరుగుతోందన్న విషయాన్ని ముందుగా తెలుసుకోవాలని పలువురు సూచిస్తున్నా రు. తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ తన రాజకీయం కోసం ఎవరినైనా వాడుకుం టారని, తెలంగాణ భావజాలాన్ని రగిల్చడానికి ఆయన చంద్రబాబును బూచిగా చూపుతారని అంటున్నారు. ఇదే సమయంలో చంద్రబాబు వ్యతిరేక రాజకీయాలు చేస్తున్న వైసీపీని కేసీఆర్ వాడుకునే ప్రయత్నం చేస్తున్నట్లు చెబుతున్నారు. వైసీపీ ద్వారా కేసీఆర్ కు ప్రయోజనం తప్పితే.. ఆయన ద్వారా వైసీపీకి ఎలాంటి మేలు ఉండదని పార్టీ నేతలు వ్యాఖ్యానిస్తున్నారు. మాజీ సీఎం జగన్ రెడ్డితో సత్సంబంధాలు కొనసాగించడం వల్ల తెలంగాణలో రెడ్డి సామాజికవర్గం కేసీఆర్ కు దగ్గరయ్యే పరిస్థితి ఉందని, కానీ, కేసీఆర్ వల్ల ఏపీలో ఏ వర్గం జగన్ కు దగ్గరయ్యే అవకాశం కనిపించడం లేదని అంటున్నారు.

# బ్రహ్మోస్ క్షిపణులకు ఎంతో డిమాండ్

తిరుపతి, దశాబ్ద కాలంగా స్టార్టప్‌లలో భారత్ దూసుకెళ్తోందని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ అన్నారు. స్పేస్ ఎకానమీలో 8వ స్థానానికి చేరుకున్నామని చెప్పారు. ఐటీ, టెలికాం రంగాల్లో పెట్టుబడులను సరళతరం చేసినట్లు వివరించారు. తిరుపతి భారతీయ విజ్ఞాన సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. 'గ్లోబల్ ఇన్నోవేషన్ ఇండెక్స్‌లో 81వ ర్యాంక్ నుంచి 38వ ర్యాంక్‌కు చేరుకున్నాం.

# ఆ ఇద్దరు కార్యదర్శులపై వేటు వెనుక గ్లోబల్ 'సమ్మెట'!

హైదరాబాద్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025పై రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుని భారీగా ఆశలు పెట్టుకున్నది. పెట్టుకున్న ఆశలు ఫలించకపోగ, ప్రతిపక్ష పార్టీల నుంచి విమర్శలు రావడం, పారిశ్రామిక వర్గాల నుంచి పెదవి విరుపులు రావడంతో రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒకింత ఆగ్రహంతో ఉన్నారని తెలుస్తున్నది. గురువారం చేపట్టిన బదిలీల్లో ఈ అంశానికి సంబంధం ఉన్న కారణంగానే ఇద్దరు ఐఏఎస్ అధికారులపై వేటు పడిందనే చర్చ సచివాలయంలో జోరుగా వినిపిస్తున్నది. సీఎం పేషీలో పరిశ్రమలు, పెట్టుబడులు, స్పీడ్ (స్మార్ట్, ప్రొయాక్టివ్, ఎఫిషియంట్, ఎఫెక్టివ్ డెలివరీ)ను పర్యవేక్షిస్తున్న ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, అడిషనల్ సీఈవో ఈ వెంకట నరసింహారెడ్డిని బదిలీ చేశారు. జయేశ్ రంజన్ పర్యవేక్షించిన విభాగాలను ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణా రావుకు పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగించారు. ఐటీఈ అండ్ సీ డిప్యూటీ సెక్రెటరీ భవేశ్ మిశ్రా (2015 బ్యాచ్)కు అడిషనల్ సీఈవోగా పూర్తి అదనపు బాధ్యతలతో అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వచ్చే నెల జనవరిలో దావోస్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక పర్యటనకు ముందు ఈ పరిణామం జరగటం గమనార్హం.

పేలవంగా గ్లోబల్ సమ్మిట్ 2025

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నెలల పాటు గ్లోబల్ రైజింగ్ సమ్మిట్ 2025 నిర్వహణపై నిరంతరం శ్రమించారు. పెట్టుబడులు ఆకర్షించడం ద్వారా తెలంగాణను ఇతర రాష్ట్రాల కన్నా ముందంజలో ఉందని చూపించాలని తాపత్రయపడ్డారు. డిసెంబర్ 8, 9 తేదీలలో రంగారెడ్డి జిల్లా కందుకూరులోని భారత్ ఫ్యూచర్ సిటీలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించగా, కేంద్ర గనుల శాఖ మంత్రి జీ కిషన్ రెడ్డి పాల్గొన్నారు. 44 దేశాల నుంచి 154 మంది ప్రతినిధులు హాజరయ్యారు. మొత్తం వేయి మంది విదేశీ ప్రతినిధులు, 500 కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని ప్రచారం చేశారు. 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన డాలర్ల ఆర్థిక వ్యవస్థ చేరుకోవాలనే లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు ప్రచార పత్రాల్లో పేర్కొన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 పేరుతో ప్రత్యేక వెబ్ పోర్టల్ కూడా రూపొందించారు. రెండు రోజుల పాటు జరిగిన గ్లోబల్ సమ్మిట్ లో రూ.5,75,000 కోట్ల పెట్టుబడులు వచ్చాయని ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేసుకున్నది. ఐటీ, డాటా సెంటర్లు, పర్యాటకం, విద్యుత్, క్రీడలు, అటవి వంటి రంగాల్లో భారీ పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. మొదటి రోజు రూ.3,97,500 కోట్లు, రెండో రోజు రూ.1,77,500 కోట్ల పెట్టుబడులకు సంబంధించి అవగాహన ఒప్పందాలు (ఎంవోయూ) కుదిరినట్లు వెల్లడించారు. దీని ద్వారా 13 లక్షల మందికి ఉద్యోగాలు లభిస్తాయని ప్రకటించారు. అయితే సమావేశ ప్రాంగణంలో ప్రత్యేక ఆహ్వానితుల కోసం ఐదు వేల కుర్చీలను ఏర్పాటు చేయగా, కేవలం 1500 మంది మాత్రమే హాజరవడం గమనార్హం. అందులోనూ ప్రభుత్వ ఉద్యోగులు, స్థానికులు ఉండటంతో ఒక విధంగా ప్రభుత్వం పరువు పోయినట్టయింది. పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన వారిలో రాష్ట్రానికి చెందిన వారే అధికంగా ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి కొద్దిమంది పారిశ్రామికవేత్తలు వచ్చారు. అగ్రిమెంట్లను చూసి ప్రతిపక్ష పార్టీలు నవ్వుకోవడమే కాకుండా ఇవేమీ పెట్టుబడులు అంటూ అపహాస్యం చేశాయి.

రూ.8,10,194 కోట్ల పెట్టుబడుల్లో రూ.18,600 కోట్లు కార్యరూపం

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన తరువాత గత ఏడాది దావోస్‌లో రూ.40,232 కోట్లు, ఈ ఏడాది దావోస్‌లో రూ.1,78,950 కోట్లు, సింగపూర్ పర్యటనలో రూ.3,950 కోట్లు, జపాన్ పర్యటనలో రూ.12,062 కోట్లు, గ్లోబల్ సమ్మిట్ లోరూ.5,75,00 కోట్లు కలిపితే మొతం రూ.8,10,194 కోట్ల విలువైన పెట్టుబడులపై ఎంవోయూలు జరిగాయి. గత రెండు దఫాలు దావోస్ లో జరిగిన ఒప్పందాల్లో ఇప్పటి వరకు ఒక్క పరిశ్రమ ఏర్పాటు కాలేదని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఇప్పటి వరకు టీజీఐఐసీ అనుమతించినవి రూ.18,600 కోట్లు మాత్రమే కార్యరూపంలోకి వచ్చాయని, కనీసం పదిశాతం కూడా పెట్టుబడులు వాస్తవరూపం దాల్చలేదనే విమర్శలొస్తున్నాయి. ఇలా కార్యరూపం దాల్చకపోవడానికి కారణం ఏంటనేది కూడా ముఖ్యమంత్రి సమీక్షించినట్లు తెలిసింది.

సమ్మిట్ లో మంత్రులు, సీనియర్ ఐఏఎస్‌కు అవమానం

రెండు రోజుల పాటు జరిగిన సమ్మిట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ ఏకపక్షంగా వ్యవహరించడం పలువురు మంత్రులు, అధికారులు నొచ్చుకున్నట్లు అప్పట్లో వార్తలొచ్చాయి. తన సొంత నిర్ణయాలతో అందరినీ ఇబ్బందులకు గురి చేశారంటున్నారు. సమ్మిట్ బాధ్యతలు ఒక్కరికే అప్పగించి, సహచర బ్యూరోక్రాట్లను పక్కనబెట్టడంపై పలువురు చర్చించుకున్నారు. తమ శాఖలో ఆయన పెత్తనం ఏంటని కొందరు సీనియర్ ఐఏఎస్ అధికారులు ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావుకు ఫిర్యాదులు కూడా చేశారు. వచ్చే ఏడాది ఖాళీ అయ్యే ప్రధాన కార్యదర్శి పదవిని దక్కించుకునేందుకు, ముఖ్యమంత్రి మెప్పు కోసం ఆయన ఇదంతా చేస్తున్నారని గుసగుసలు విన్పించాయి. గ్లోబల్ సమ్మిట్‌ను తన ఒంటి చేత్తో నిర్వహించానని చెప్పుకొనే విధంగా వ్యవహరించారంటున్నారు.




రెండు రోజులపాటు జరిగిన సమ్మిట్‌లో 15 అంశాలపై ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. ఈ సమావేశాల్లో ముగ్గురు మంత్రులకు మాత్రమే అనుమతించడంతో మిగతావారు అలిగి వెళ్ళిపోయారు. ఇదేమి సమ్మిట్ అంటూ సదరు మంత్రులు, ప్రధాన కార్యదర్శి ముందు అక్కసు వెళ్లగక్కినట్లు ప్రచారం జరిగింది. అయితే సదస్సు తరువాత ముఖ్యమంత్రిని కలిసిన సందర్భంలో మంత్రులు, సీనియర్ ఐఏఎస్‌లు జయేశ్ రంజన్పై ఫిర్యాదులు చేశారని సచివాలయంలో కొద్ది రోజులుగా ప్రచారం జరుగుతోంది. సమ్మిట్‌లో ఫిజిక్స్ వాలా అనే సంస్థ రాష్ట్రంలో డిజిటల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ముందుకు వచ్చి ఎంవోయూ కుదుర్చుకున్నది. దేశంలో డిజిటల్ యూనివర్సిటీలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి విధాన నిర్ణయం ప్రకటించలేదు. ఇలాంటి అంశాలను ముఖ్యమంత్రి కూడా తీవ్రంగా పరిగణించారని అంటున్నారు.


బీఆర్ఎస్ ఏలుబడిలో కేటీఆర్‌తో సాన్నిహిత్యం

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో జయేశ్ రంజన్ అప్పటి ఐటీ శాఖ మంత్రి కే తారక రామారావుతో అత్యంత సన్నిహితంగా మెలిగారు. ఐటీ శాఖలో అన్నీ తానై ముఖ్య కార్యదర్శిగా పనిచేశారు. రామారావును దేశ విదేశాలకు తిప్పించి బుట్టలో వేసుకున్నారనే గుసగుసలు అప్పట్లో విన్పించాయి. విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన తరువాత కేటీఆర్, జయేశ్ రంజన్ అప్పటి సీఎం కే చంద్రశేఖర్ రావును ప్రగతి భవన్‌లో కలిశారు. పెట్టుబడుల కోసం విదేశాలకు వెళ్లారా, మరేదైనా పని కోసం వెళ్తున్నారా అంటూ చురకలు వేశారని ప్రభుత్వ వర్గాల్లో ప్రచారం జరిగింది. ఇలాంటి పర్యటనలు వద్దు అని కేసీఆర్ ఇద్దరినీ గట్టిగా హెచ్చరించి పంపించినట్లు పరిశ్రమల శాఖలో ఉద్యోగులు చర్చించుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన తరువాత మొదటి దఫాలో ఐటీ అండ్ కమ్యూనికేషన్ అదనపు ముఖ్య కార్యదర్శిగా, ఆ తరువాత ముఖ్య కార్యదర్శిగా కొనసాగుతూ వస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అయిన మరుసటి సంవత్సరం 2024 అక్టోబర్ నెలలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పదోన్నతి పొందారు. కడప జిల్లా కలెక్టర్ గా 2002 నుంచి 2005 వరకు పని చేశారు. 2004లో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డితో సాన్నిహిత్యం పెంపొందించుకుని 2005లో హైదరాబాద్‌లోని హైదరాబాద్ అర్బన్‌డెవలప్‌మెంట్ అథారిటీ (హుడా)కు వైస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. హుడాను ఆ తరువాత పరిధి పెంచి హెఎండీఏగా మార్చారు. ఈయన హయాంలో ప్రభుత్వ భూములను హుడా వేలం వేయడంతో పాటు ఔటర్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్లలో గోల్‌మాల్ చోటుచేసుకోవడం, దానిపై వైఎస్ఆర్ సీబీఐ విచారణకు ఆదేశించడం అందరికీ తెలిసిందే. జయేశ్ రంజన్ ఆధీనంలోనే ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్సీ పీ వెంకట్రామ్ రెడ్డి కార్యదర్శిగా పనిచేశారు. ఆ తరువాత ఐఏఎస్ గా పదోన్నతి పొంది సిద్ధిపేట జిల్లా కు కలెక్టర్ గా పనిచేసి, పదవీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్సీ గా ఎన్నికయ్యారు. టాస్క్, వీ హబ్, ఐటీ విభాగంలో తన వర్గానికి చెందిన ఉత్తరాది రాష్ట్రాల వారిని నియమించారనే ఆరోపణలు జయేశ్ రంజన్ పై ఉన్నాయి. టాస్క్ అనగా తెలంగాణ అకాడెమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్. దీని ప్రధాన లక్ష్యం రాష్ట్రంలో యువతకు నైపుణ్య శిక్షణను అందించడం. భారత దేశంలోనే మొట్ట మొదటి సారిగా తెలంగాణలో మహిళా పారిశ్రామికవేత్తల కోసం వీ హబ్ ఇంక్యూబేటర్ ను ఏర్పాటు చేశారు. తెలంగాణ ఐటీ విభాగంలో మొత్తం తన వర్గం వారిని నియమించుకున్నారని పలువురు అప్పట్లో కేటీఆర్ తో పాటు కేసీఆర్ కు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదంటున్నారు. గడచిన దశాబ్ద కాలంగా ఐటీ శాఖ లో కొనసాగుతూ, తన సామ్రాజ్యాన్ని విస్తరించుకున్నారని సచివాలయంలో కొందరు ఐఏఎస్ అధికారులు చర్చించుకుంటున్నారు. పాలకుల వల్లే ఇది సాధ్యమైందని, ఒకే శాఖలో పది సంవత్సరాల పాటు కొనసాగిస్తే పరిణామాలు ఇలాగే ఉంటాయంటున్నారు.

టీజీఐఐసీలో పదేళ్ల పాటు

రాష్ట్ర సహకార శాఖ అధికారి అయిన ఈ వెంకట నరసింహా రెడ్డి డిప్యూటేషన్‌పై తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనా సంస్థ (టీజీఐఐసీ)లో ఈడీగా చేశారు. ఇన్‌చార్జ్ ఎండీగా వ్యవహరించారు. మెదక్ జిల్లా వాసి కావడంతో అప్పటి మంత్రి కేటీఆర్ పూర్తి మద్దతు పలికారనే వాదనలు ఉన్నాయి.

# ముఖ్య నేత కోసమే జన్వాడలో ఇంటర్ ఛేంజ్?



హైదరాబాద్,నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టు పక్కల ప్రజల రవాణాను సులభతరం చేసేందుకు మరో మూడు కొత్త ఇంటర్ ఛేంజెస్ ను హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్ మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ) ప్రతిపాదించింది. మూడింటిలో ఒక ఇంటర్ ఛేంజ్ మాత్రం ఒక ముఖ్య నేత లే అవుట్ కోసం హెచ్ఎండీఏ అధికారులు ప్రతిపాదించినట్లు సమాచారం. తాజాగా మూడింటి చేరికతో ఇంటర్ ఛేంజ్ ట్రంఫెట్ ల సంఖ్య 25 కు చేరుకున్నది. వీటి ద్వారానే వాహనదారులు నిర్ణీత ప్రాంతాల్లో ఓఆర్ఆర్ పైకి వెళ్లడం, దిగడం చేస్తున్నారు. జన్వాడతో పాటు పడమటి సాయిగూడ, కొహెడ ప్రాంతాలలో కొత్తగా వీటిని నిర్మాణం చేయనున్నారు. పెద్ద అంబర్ పేట, బొంగుళూర్ ఇంటర్ ఛేంజ్ మధ్యలో కొహెడ ట్రంఫెట్ ప్రతిపాదించారు. ఇక్కడ భారీ స్థాయిలో పండ్ల మార్కెట్ తో పాటు భారీ కోల్డ్ స్టోరేజీలను రాష్ట్ర ప్రభుత్వం నిర్మాణం చేస్తున్నది. విదేశాలకు పండ్లు ఎగుమతులు చేసే వీధంగా ఇక్కడ ఏర్పాట్లు చేస్తున్నారు. కీసర, ఘట్ కేసర్ ఎగ్జిట్ గేట్ల మధ్య పడమటి సాయిగూడ లో మరో ఎగ్జిట్ గేట్ ను ప్రతిపాదించారు. శంకర్ పల్లి మండలం జన్వాడతో పాటు పరిసర ప్రాంతాలలో పెద్ద ఎత్తున ప్రముఖుల భూములు ఉన్నాయి. ఈ భూములకు మార్కెట్ లో మంచి డిమాండ్ ఉంది. అధికార పార్టీతో ప్రతిపక్ష పార్టీలు, వీఐపీల భూములు ఉండడంతో ధరలు పెంచేందుకు పాలకులు అనేక చర్యలు తీసుకుంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. నియోపోలిస్, కొల్లూరు ఎగ్జిట్ల మధ్య కొత్తగా జన్వాడ ఇంటర్ ఛేంజ్ నిర్మాణం చేయనున్నారు. 158 కిలోమీటర్ల పొడవున ఉన్న ఎనిమిది లేన్ల నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు పై మొత్తం 22 ఇంటర్ ఛేంజెస్ ఉండగా, కొత్తగా చేరిన మూడింటితో వాటి సంఖ్య 25కు చేరుకోనున్నది. రింగ్ రోడ్డు నిర్మాణం చేసిన సమయంలో 19 ఇంటర్ ఛేంజెస్ మాత్రమే ఉన్నాయి. కొల్లూరు, పటాన్ చెరు, సుల్తాన్ పూర్, దుండిగల్, మేడ్చల్, శామీర్ పేట, కీసర, ఘట్ కేసర్, తారామతి పేట, పెద్ద అంబర్ పేట, బొంగుళూర్, రావిర్యాల్, తుక్కుగూడ, పెద్ద గోల్కొండ, శంషాబాద్, రాజేంద్రనగర్, టీజీపీఏ, కోకాపేట తో పాటు నానక్ రామ్ గూడ ఉన్నాయి. ఆ తరువాత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మల్లంపేట, నార్సింగి, నియో పోలిస్ వద్ద ప్రతిపాదించడంతో వాటి సంఖ్య 22కు చేరుకున్నది. నార్సింగి వద్ద గతేడాది జూలై నెలలో ప్రారంభించగా, మల్లంపేట వద్ద మొన్న అక్టోబర్ లో ప్రారంభించారు. న్యాయపరమైన సమస్యల కారణంగా నియో పోలిస్ పనులు ఆలస్యమయ్యాయి. నియో పోలిస్ అందుబాటులోకి వస్తే నియో పోలిస్ లే అవుట్ తో పాటు గచ్చిబౌలి, నార్సింగి ప్రాంత వాసులు వెళ్లేందుకు సులభతరం అవుతుంది. కోకాపేటలో మూడేళ్ల క్రితం హెచ్ఎండీఏ 530 ఎకరాల్లో నియో పోలిస్ లే అవుట్ వేసి ఓపెన్ ప్లాట్లను విక్రయించింది. ఒక ఎకరం ధర ఇక్కడ రూ.100 కోట్లు పలికిన విషయం తెలిసిందే. చాలా కంపెనీలు ఇక్కడ స్థలాలు కొనుగోలు చేశాయి. మల్టీ పర్పస్ గా స్థలాలను వినియోగిస్తుండడంతో ట్రాఫిక్ సమ్యలు లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించారు.

# సాహస బాలలకు బాల పురస్కార్ అవార్డులు

న్యూఢిల్లీ, న్యూఢిల్లీ వేదికగా 'ప్రధాన మంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్' కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఢిల్లీలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చిన్నారులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ పురస్కారాలు ధైర్య సాహసాలు, కళలు, సంస్కృతి, పర్యావరణం, ఇన్నోవేషన్స్, సైన్స్ అండ్ టెక్నాలజీ, క్రీడలు అనే ఆరు విభాగాల్లో సృజనాత్మకత చూపించిన వారికి అందించారు. అవార్డు గెలుచుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు రాష్ట్రపతి అభినందనలు తెలిపారు. వారి సాహసాలు, విజ్ఞానం దేశానికి గర్వకారణం ఆమె ప్రశంసించారు. వయసుకు మించి ధైర్యసాహసాలు, ప్రతిభను ప్రదర్శించే చిన్నారులకు 'వీర్ బాల్ దివస్' సందర్భంగా ఏటా పురస్కారాలు అందిస్తారు. ఈ ఏడాది రాష్ట్రపతి భవన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా బిహార్ చిన్నోడు వైభవ్ సూర్యవంశీ సహా పలువురు చిన్నారులు 'ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల్ పురస్కార్'ను అందుకున్నారు. పురస్కార గ్రహీతల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. వీరిలో వ్యోమప్రియ ప్రదర్శించిన సాహసం, శ్వాన్ సింగ్ ఉదారత పలువురి హృదయాలను కదిలించింది. కరెంట్ షాక్ నుంచి ఓ బాలుడిని కాపాడబోయి ప్రాణాలు కోల్పోయిన 8 ఏళ్ల చిన్నారి వ్యోమ ప్రియ తరపున ఆమె తల్లి అర్చనా శివరామకృష్ణన్ రాష్ట్రపతి నుంచి పురస్కారం స్వీకరించారు. ఈ సందర్భంగా కుమార్తెను గుర్తుచేసుకుంటూ భావోద్వేగానికి గురయ్యారు. 'నా కుమార్తె తరఫున ఈ అవార్డు తీసుకుంటున్నా. అప్పుడు మా అమ్మాయికి ఎనిమిదేళ్లు. మా అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లో ఉన్న పిల్లల పార్క్‌లో మిగతా చిన్నారులతో కలిసి ఆడుకుంటోంది. అక్కడ అండర్‌గ్రౌండ్ కేబుల్‌పై ఏర్పాటు చేసిన స్లైడ్‌పై ఆడుకుంటున్న ఆరేళ్ల పిల్లాడు అకస్మాత్తుగా పడిపోయాడు. ఆ చిన్నారిని కాపాడదామని వెళ్లిన నా కూతురుకు కరెంట్ షాక్ తగిలింది. ఆ ఘటనలో మా ప్రియతో పాటు ఆ బాలుడు కూడా ప్రాణాలు కోల్పోయాడు. కేబుల్ దెబ్బతిని ఉండటంతో స్లైడ్‌కు షాక్ రావడమే అందుకు కారణమైంది. అంత చిన్న వయసులోనే ధైర్యం ప్రదర్శించిన నా బిడ్డ ఇప్పుడు నేరుగా వచ్చి ఈ అవార్డు తీసుకొని ఉంటే ఎంతో సంతోషించేవాళ్లం అంటూ అర్చనా ఉద్వేగభరితంగా చెప్పారు. 2024 మేలో తమిళనాడులోని కొయంబత్తూరులో ఈ విషాద ఘటన చోటుచేసుకుంది.'ఆపరేషన్ సిందూర్ సమయంలో ఓ పదేళ్ల బాలుడు మన సైనికులకు బాసటగా నిలిచాడు. అడగకముందే వారికి మంచినీరు, పాలు, టీ, లస్సీ.. వంటివి అందిస్తూ తనవంతు సాయం చేశాడు. అతడే శ్వాన్ సింగ్. పంజాబ్‌లోని ఫిరోజ్‌పుర్ జిల్లాకు చెందిన ఆ బాలుడి ధైర్యసాహసాలు, ఉత్సాహానికి ప్రశంసించిన సైన్యం అతడి చదువుకయ్యే ఖర్చులు పూర్తిగా భరించేందుకు ముందుకొచ్చింది. ఈ క్రమంలో తాజాగా శ్వాన్ సింగ్‌ను ఇప్పుడు బాలల పురస్కారం వరించింది. ఈ అవార్డును తాను కలలో కూడా ఊహించలేదని చిన్నారి సంతోషం వ్యక్తంచేశాడు. ఏటా డిసెంబర్ 26న వీర్ బాల్ దివస్ నిర్వహిస్తారు.

# జడ్పీ చైర్ పై బొత్స కూతురు!

విజయనగరం:గత మూడు దశాబ్దాలుగా విజయనగరం జిల్లాలో రాజకీయంగా చక్రం తిప్పుతున్న సీనియర్ నేత బొత్స సత్యనారాయణ.. వచ్చే ఎన్నికల నాటికి అస్త్రసన్యాసం చేయాలనే ఆలోచన చేస్తున్నారా? అన్న చర్చ జరుగుతోంది. ఇటీవల కాలంలో జిల్లా రాజకీయాల్లో బొత్స వారసులైన కూతురు, కొడుకు సందడి చేస్తుండటంతో బొత్స రిటైర్మెంట్ పై ఊహాగానాలు వ్యాపిస్తున్నాయి. ప్రస్తుతం విశాఖ కేంద్రంగా తన రాజకీయ కార్యకలాపాలు సాగిస్తున్న బొత్స.. సొంత నియోజకవర్గం చీపురుపల్లిని మాత్రం జాగ్రత్తగా కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. గత 30 ఏళ్లలో ఎన్నడూ లేనట్లు ఇప్పుడు చీపురుపల్లిలో జరిగే ప్రతి కార్యక్రమానికి వస్తున్నారు. ఆయన రాలేని పరిస్థితుల్లో కూతురు లేదా కొడుకును పంపిస్తున్నారు. దీంతో బొత్స రాజకీయ వ్యూహంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. రాజకీయంగా ప్రస్తుతం బొత్స క్రియాశీలంగా ఉన్నా.. వచ్చే ఎన్నికల సమయం నాటికి ఆయన చురుకైన పాత్ర పోషించే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు. ఈ కారణంగానే ముందస్తుగా వారసులను రంగంలోకి దింపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే బొత్స కుటుంబం నుంచి అరడజను మంది జిల్లా రాజకీయాల్లో ఉన్నారు. వీరికి తోడుగా యువతరం కూడా రంగ ప్రవేశం చేయడంతో బొత్స కుటుంబ రాజకీయ కార్యకలాపాలపై పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. ప్రధానంగా సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో గత ఎన్నికల్లో ఓడిపోయిన బొత్స.. మళ్లీ అక్కడ నుంచి పోటీకి విముఖత చూపుతున్నట్లు చెబుతున్నారు. తన రాజకీయ జీవితంలో సీఎం తప్ప అని పదవులను అనుభవించిన తాను.. భవిష్యత్తులో రాజ్యసభలో అడుగుపెట్టడం ద్వారా ఆ అనుభవాన్ని సాధించాలని చూస్తున్నారని అంటున్నారు. గత ఎన్నికల సందర్భంగానే పోటీకి దూరంగా ఉండాలని భావించినప్పటికీ పార్టీ అధ్యక్షుడు జగన్ ఒత్తిడితో పోటీ చేయాల్సివచ్చిందని చెబుతున్నారు. ఇక వచ్చే ఎన్నికల నాటికి 70 ఏళ్ల వయసు దాటిపోనుండటం వల్ల పోటీ నుంచి తప్పుకోవాలని బొత్స భావిస్తున్నట్లు చెబుతున్నారు. అయితే తనకు బదులుగా కొడుకు సందీప్ ను చీపురుపల్లి నుంచి పోటీ చేయించాలని బొత్స డిసైడ్ అయ్యారంటున్నారు. గత ఎన్నికల్లోనే సందీప్ పోటీకి ఉత్సాహం చూపినా పార్టీ చాన్స్ ఇవ్వలేదని అంటున్నారు. అయితే ఇప్పుడు సందీప్ తోపాటు బొత్స కూతురు అనూష కూడా చీపురుపల్లిలో ఎక్కువగా తిరుగుతున్నారు. రాజకీయంగా తన ఆసక్తిని బహిరంగంగా వ్యక్తపరుస్తున్నారు. దీంతో కూతురు, కుమారుడు మధ్య రాజకీయ విభేదాలు రాకుండా కూడా బొత్స ముందు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. కొద్దిరోజుల వరకు బొత్స స్థానికంగా అందుబాటులో లేని సమయంలో కూతురు లేదా కొడుకు మాత్రమే నియోజకవర్గంలో పర్యటించేవారు. అయితే ఇప్పుడు బొత్స జోక్యంతో ఇద్దరూ ఒకే కార్యక్రమంలో మెరుస్తున్నట్లు వ్యాఖ్యానిస్తున్నారు. బొత్స వారసుడు సందీప్ రాజకీయ ప్రవేశానికి ఇబ్బంది లేకుండా కూతరు అనూషకు ప్రత్యామ్నాయం చూపేలా బొత్స ప్లాన్ చేసినట్లు సమాచారం. కుమారుడు సందీప్ కు తన స్థానంలో చీపురుపల్లి అసెంబ్లీ స్థానం అప్పగించాలని భావిస్తున్న బొత్స.. కుమార్తె అనూషను కూడా అదే నియోజకవర్గం నుంచి జడ్పీటీసీగా పరిచయం చేసి జిల్లా రాజకీయాలలో తిప్పాలని ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. చీపురుపల్లి నియోజకవర్గంలోని గరివిడి జడ్పీటీసీగా అనూషను పోటీకి పెట్టి.. విజయనగరం జడ్పీ చైర్ పర్సన్ అభ్యర్థిగా ప్రకటించేలా బొత్స పావులు కదుపుతున్నారని అంటున్నారు. ప్రస్తుతం విజయనగరం జడ్పీ చైర్మన్ గా బొత్స మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు ఉన్నారు. ఈయనను వైసీపీ అధిష్టానం భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమించింది. దీంతో మజ్జి శ్రీనివాసరావు అలియాస్ చిన్నశ్రీను వచ్చే స్థానిక ఎన్నికల్లో పోటీకి దూరంగా ఉంటారని అంటున్నారు. దీంతో జడ్పీ చైర్పర్సన్ అభ్యర్థిగా బొత్స అనూషను ప్రకటించి కుమారుడికి అడ్డు లేకుండా చేయడంతోపాటు జడ్పీపీఠం తన కుటుంబంలోనే ఉండేలా బొత్స ప్లాన్ చేస్తున్నారని అంటున్నారు. గతంలో కూడా బొత్స సతీమణి బొత్స ఝాన్సీ, అదే కుటుంబానికి చెందిన బడ్డుకొండ అప్పలనాయుడు జడ్పీ చైర్మన్లుగా పనిచేశారు. ఈ నేపథ్యంలోనే బొత్స అనూషను జడ్పీ చైర్ పర్సన్ చేయాలని సత్తిబాబు వ్యూహాలు రచిస్తున్నారని వ్యాఖ్యానిస్తున్నారు. మొత్తానికి తాజా రాజకీయ పరిణామాలతో బొత్స వచ్చే ఎన్నికల నాటికి ప్రత్యక్ష ఎన్నికల రాజకీయాల నుంచి తప్పుకునే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని అంటున్నారు.

# ఎప్పటికైనా సొంతింటికి వెళ్లాల్సిందే



హైదరాబాద్,ఎమ్మెల్యే రాజాసింగ్ మళ్లీ వార్తల్లోకి వచ్చారు. ఎప్పికైనా సొంతింటికి వెళ్లక తప్పదని చెప్పారు. ఒక కుటుంబంలో నలుగురు అన్నదమ్ములు ఉండి, ఒక అన్నయ్య గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోతే.. ఏదో ఒక రోజు అతను ఇంటికి తిరిగి రావాల్సి ఉంటుందన్నారు. అలాగే తాను కూడా ఈ రోజు కాకపోయినా రేపైనా తన ఇంటికి తిరిగి వెళ్లాల్సి ఉంటుందని చెప్పారు. అయితే ఆ శుభ సమయం ఎప్పుడు వస్తుందో చెప్పలేనంటూ దాటవేశారు. తాను బీజేపీకినిజమైన సైనికుడిని అని తెలిపారు. ఢిల్లీ లేదా రాష్ట్ర నాయకులు తనను పిలిచిన రోజున తిరిగి పార్టీలోకి వస్తానని తేల్చి చెప్పారు. ఇంతకు ముందు కూడా తాను ఇదే అభ్యర్థన చేశానని.. ఇప్పుడు కూడా అదే అభ్యర్థన చేస్తున్నానని చెప్పారు.అసెంబ్లీలో స్వేచ్ఛ కల్పించాలని, ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీకి వారి నియోజకవర్గంలో స్వేచ్ఛ ఇవ్వాలని.. అప్పుడే బీజేపీ భవిష్యత్తులో అధికారంలోకి రాగలదని రాజాసింగ్ అన్నారు. ఈరోజు కాకపోయినా రేపైనా తనకు ఢిల్లీ పెద్దల నుండి లేదా రాష్ట్ర పెద్దల నుంచి పిలుపు వస్తుందని ఖచ్చితంగా తెలుసని చెప్పారు. వారి నుంచి ఫోన్ వస్తే.. తాను ఒకటే ఒక రిక్వెస్ట్ చేస్తానని అన్నారు. తమకు పార్టీ పెద్ద నాయకులు నుంచి స్వేచ్ఛ ఇవ్వండి అని కోరతానని చెప్పారు. అలా స్వేచ్ఛ ఇచ్చిన తర్వాత.. బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలతో తాము ఏ విధంగా యుద్ధం చేస్తామో అంతా చూస్తారని రాజాసింగ్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే రాజాసింగ్ కొంతకాలం క్రితం బీజేపీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఆయన ఏ పార్టీలో చేరకుండా ఒంటరిగానే ఉన్నారు. అయితే ఇటీవల ఆయన తిరిగి మళ్లీ బీజేపీలో చేరతారంటూ ఊహాగానాలు వస్తున్నాయి. ఈ విషయమై ఆయన..పార్టీ అగ్రనేతలతో చేసిన చర్చలు సఫలమైనట్లు కూడా తెలుస్తోంది. నెల రోజుల్లో ఆయన కాషాయ కండువా కప్పుకోవచ్చనే వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాజాసింగ్ వ్యాఖ్యలు సంచలనం కలిగిస్తున్నాయి.

# స్త్రీ శక్తి పథకం.. రూ.800 కోట్లు విడుదల

అమరావతి, రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించేందుకు స్త్రీ శక్తి పథకానికి అదనంగా రూ.800 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికల హామీ అయిన 'సూపర్ సిక్స్' అమలులో భాగంగా ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ నిధులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్ఆర్టీసీ)కు రీయింబర్స్‌మెంట్ కింద చెల్లించనున్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ ఏడాది ఆగస్టు 15న విజయవాడలోని పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో 'స్త్రీ శక్తి' పథకాన్ని ప్రారంభించిన విషయం తెలిసిందే.ఈ పథకం అమలు కారణంగా ఆర్టీసీపై ఆర్థిక భారం పడకుండా చూస్తామని ప్రభుత్వం ముందునుంచీ స్పష్టం చేస్తోంది. ఇందులో భాగంగానే ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు అయిన ఖర్చుల కోసం నవంబర్ 13న తొలి విడతగా రూ.400 కోట్లను విడుదల చేసింది. తాజాగా మరో రూ.800 కోట్లను విడుదల చేయడంతో ఆర్టీసీకి భారీ ఊరట లభించింది.

ఏటా రూ.1,942 కోట్లు

జీరో టికెట్ ప్రయాణికుల ఛార్జీలను 100% రీయింబర్స్‌మెంట్ చేస్తామని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఇదివరకే తెలిపారు. ప్రభుత్వ అంచనాల ప్రకారం ఈ పథకానికి ఏటా సుమారు రూ.1,942 కోట్లు ఖర్చవుతుంది. రాష్ట్రవ్యాప్తంగా పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో మహిళలు ఉచితంగా ప్రయాణిస్తున్నారు. తాజాగా విడుదలైన నిధులతో డీజిల్, సిబ్బంది జీతాలు వంటి నిర్వహణ ఖర్చులకు ఇబ్బందులు తొలగిపోతాయని ఆర్టీసీ వర్గాలు భావిస్తున్నాయి. ఈ పథకం అమలు తీరుపై రవాణా శాఖ మంత్రి జనవరి 2026లో సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉంది.



# ప్రాంతీయ భాషలే ప్లస్..40 శాతం వరకు సమయం ఆదా




హైదరాబాద్,రోజువారీ ఉద్యోగ విధుల్లో భాగంగా కస్టమర్లతో మాట్లాడాల్సిన ఫ్రంట్‌లైన్ ఉద్యోగులను తీసుకునేందుకు అంకుర సంస్థలు కొత్త పంథాను ఎంచుకుంటున్నాయి. ప్రాథమికంగా దరఖాస్తులను మదింపు చేయడంలాంటి పనుల కోసం ప్రాంతీయ భాషల్లోని కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను విస్తృతంగా ఉపయోగించుకుంటున్నాయి. ఈ టూల్స్ వినియోగంతో నియామకాలకు పట్టే సమయం దాదాపు 40% వరకు ఆదా అవుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. షెఫ్‌లు, స్టోర్ ఆపరేటర్లలాంటి ఉద్యోగాలకు చాలా మంది దరఖాస్తుదారులు, ఇంగ్లిష్ కన్నా, ప్రాంతీయ భాషల్లోనే మాట్లాడటమే సౌకర్యవంతంగా భావిస్తున్నారనే విషయం గ్రహించిన క్లౌడ్ కిచెన్ ఆపరేటరు క్యూర్‌ఫుడ్స్ ఈ ఏడాది నుంచి నియామకాల ప్రక్రియ కోసం నేటివ్ ల్యాంగ్వేజ్ ఏఐ సాధనాలను ఉపయోగించడం ప్రారంభించింది. ప్రస్తుతం తొలి దశ స్క్రీనింగ్‌ను ఆటోమేటెడ్ వాయిస్‌బాట్స్‌తో నిర్వహిస్తోంది. దీని వల్ల రిక్రూట్‌మెంట్ విభాగం సిబ్బందిపై ఒత్తిడి, అలాగే నియామకాలకు పట్టే సమయం తగ్గుతోందని కంపెనీ పేర్కొంది. తెలుగు, తమిళం, హిందీ తదితర ప్రాంతీయ భాషలకు ప్రాధాన్యమిచ్చే, ద్వితీయ..తృతీయ శ్రేణి పట్టణాల్లో నివసించే ప్రతిభావంతులైన దరఖాస్తుదార్లనూ పరిగణనలోకి తీసుకునేందుకు వీలవుతోందని తెలిపింది. వేగంగా నిర్ణయాలు తీసుకునేందుకు తోడ్పడుతోందని పేర్కొంది.

వాహన్ ఏఐ తదితర థర్డ్ పార్టీ ప్లాట్‌ఫాంలు

కొన్ని ఈ-కామర్స్, టెక్ స్టార్టప్‌లలో సిబ్బంది సంఖ్య 70 శాతం పైగా పెరిగే అవకాశం ఉందనే అంచనాలు ఉన్నాయి. చాలా అంకుర సంస్థలు తమ మానవ వనరుల విభాగంలో సిబ్బందిని పెంచుకోవాల్సిన అవసరం లేకుండా, ప్రాంతీయ భాషల్లో హైరింగ్ సొల్యూషన్స్ అందించే థర్డ్ పార్టీ ప్లాట్‌ఫాంల సర్వీసులను వినియోగించుకుంటున్నాయి. దీంతో వాహన్ ఏఐ, బోల్నా ఏఐ, సంవాదిని లాంటి కంపెనీల సేవలకు డిమాండ్ పెరుగుతోంది.స్టార్టప్‌లు చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతులను కూడా తీసుకునేందుకు ఈ తరహా హైరింగ్ విధానం ఉపయోగపడుతోందని ఇన్‌స్టాహైర్ వర్గాలు వివరించాయి. దేశీయంగా ఏఐ ప్రొఫెషనల్స్ 23.5 లక్షల మంది పైగా ఉన్నప్పటికీ వివిధ కార్యకలాపాల నిర్వహణకు తగినంత మంది దొరకడం లేదు. డిమాండ్, సరఫరాకి మధ్య 51% పైగా వ్యత్యాసం ఉంటోంది. దీనితో ఎక్కువగా సంక్లిష్టత ఉండని, పెద్ద స్థాయిలో నిర్వహించాల్సిన ప్రాథమిక స్క్రీనింగ్, రొటీన్‌గా వచ్చే ప్రశ్నలకు సమాధానాలివ్వడం, ఇంటర్వ్యూలను ఫిక్స్ చేయడంలాంటి పనుల కోసం అంకురాలు ఏఐ టూల్స్‌ని ఎంచుకుంటున్నాయి. ప్రాంతీయ భాషల్లోని వాయిస్ బాట్స్ ఏకకాలంలో పెద్ద సంఖ్యలో కాల్స్‌ని హ్యాండిల్ చేయగలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అప్నాలాంటి జాబ్స్ మార్కెట్‌ప్లేస్ అంకుర సంస్థ అంతర్గతంగా రూపొందించిన ఏఐ కాలింగ్ ఏజెంటును వినియోగిస్తోంది. తొలి దశ స్క్రీనింగ్‌కి దీన్ని ఉపయోగిస్తోంది. రిక్రూటర్లు నిర్దిష్టంగా ప్రశ్నలను తయారు చేసి సిస్టమ్‌లో ఫీడ్ చేస్తారు. ఆ తర్వాత సదరు సిస్టమే, దరఖాస్తుదార్లకు కాల్ చేసి, వారి సమాధానాలను విశ్లేషించుకుని, షార్ట్‌లిస్ట్ చేస్తుంది. దీని వల్ల మాన్యువల్‌గా స్క్రీనింగ్‌కి పట్టే సమయం సగానికి పైగా తగ్గింది. ఈ టూల్‌ని అప్నా తమ క్లయింట్ కంపెనీలకూ ఆఫర్ చేస్తోంది.

మెరుగ్గా అంచనా వేసేందుకు వీలు ..

అలాగే దేశవ్యాప్తంగా చిన్న, మధ్యతరహా సంస్థలకు (ఎంఎస్ఎంఈ) రుణ సేవలందించే ఫ్లెక్సిలోన్స్ కూడా ఇదే తరహాలో నియామకాలకు ఏఐ టూల్స్‌ని ఉపయోగిస్తోంది. దీనితో ఫ్రంట్‌లైన్ సిబ్బంది నియామకాల ప్రక్రియకు పట్టే సమయం 30%-%40 శాతం మేర తగ్గిందని కంపెనీ వివరించింది. అభ్యర్థులు తమకు సౌకర్యవంతంగా ఉండే భాషలో మాట్లాడటం వల్ల వారి సామర్థ్యాలను మరింత మెరుగ్గా అంచనా వేసేందుకు వీలవుతోందని తెలిపింది. ఇలాంటి సిస్టమ్స్ ఇచ్చే విశ్లేషణల వల్ల పక్షపాత ధోరణి తగ్గి, అభ్యర్థుల షార్ట్‌లిస్టింగ్ ప్రక్రియ వేగవంతమవుతుందని ఫ్లెక్సిలోన్స్ వివరించింది. ముఖ్యంగా రాతపరమైన ఇంగ్లిష్ నైపుణ్యాల కన్నా స్థానిక భాషల్లో మాట్లాడే నైపుణ్యాలు ఎక్కువగా అవసరమయ్యే సేల్స్, కలెక్షన్ మొదలైన ఉద్యోగాలకు ఇది ఎంతో ఉపయోగకరమని పేర్కొంది.

# కోకాపేట గౌడ భవనం నిర్మించాలి..మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్,కేసీఆర్ ప్రభుత్వ హయాంలో గౌడ కులస్తుల కోసం కోకాపేటలో 5 కోట్ల రూపాయలతో కేటాయించిన 5 ఎకరాల స్థలంలో ప్రభుత్వం వెంటనే గౌడ భవనాన్ని నిర్మించాలని మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ (గోపా)ఆధ్వర్యంలో గోపా స్వర్ణోత్సవాలను కాచిగూడ మున్నూరుకాపు సంఘం మ్యాడం అంజయ్య హాల్‌లో నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, పీసీసీ అధ్యక్షుడు మహేకుమార్‌గౌడ్, శాషనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, జస్టిస్ ఈశ్వరయ్య హాజరయ్యారు.అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ గౌడ కులస్తులు అర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో వైన్ షాపులలో 10 శాతం రిజర్వేషన్లు కేటాయించామన్నారు. కులవృత్తి ఆత్మగౌరవం పెంపొందించడం కోసం ట్యాంక్ బండ్‌పై నీరా కేఫ్‌ను ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. ప్రభుత్వం వీటిని పట్టించుకోకపోవడంతో మరుగున పడుతున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మిసీ కమిషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, చక్రవర్తి, అంబాల నారాయణగౌడ్, కిషోర్‌గౌడ్, ఫ్లలె రవి, బాల్‌రాజుగౌడ్, జీవోపీఏ బండి సాయన్నగౌడ్, ప్రధాన కార్యదర్శి జివి శ్రీనివాస్‌గౌడ్, రఘునాథ్‌గౌడ్, రామ్మోహన్‌గౌడ్, మీరయ్యగౌడ్, శారద గౌడ్, ఎన్.రమేశ్‌గౌడ్, మహేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



# పాక్ గుండెల్లో 'సిందూర్ 2.0' గుబులు

న్యూఢిల్లీ: పహల్గాం ఉగ్రవాద దాడికి ప్రతీకారంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు చావుదెబ్బ తగిలింది. పాక్ భూభాగంలోకి చొచ్చుకెళ్లి మరీ దాడి చేయడంతో పెద్ద సంఖ్యలో ముష్కరులు హతమయ్యారు. ఉగ్రవాద స్థావరాలు, శిక్షణా కేంద్రాలు నేలమట్టమయ్యాయి. పాక్ వైమానిక కేంద్రాలు, యుద్ధ విమానాలు సైతం ధ్వంసమయ్యాయి. ఆపరేషన్ సిందూర్‌తో జరిగిన నష్టాన్ని పూడ్చుకోవడం ఇప్పట్లో సాధ్యం కాదని సాక్షాత్తూ పాకిస్తాన్ సైన్యమే చెబుతోంది. భారత సైన్యం సత్తా ఏమిటో పొరుగు దేశానికి తెలిసొచ్చింది. దాంతో ముందు జాగ్రత్త చర్యగా పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీఓకే) సరిహద్దు అయిన నియంత్రణ రేఖ(ఎల్‌ఓసీ) వద్ద భద్రతను కట్టుదిట్టం చేసింది. కీలక ప్రాంతాల్లో కౌంటర్-డ్రోన్ వ్యవస్థలను మోహరించింది. మరో కవ్వింపు చర్యలకు పాల్పడితే సిందూర్ మళ్లీ ప్రారంభమవుతుందని భారత ప్రభుత్వం ఇప్పటికే హెచ్చరించింది. అందుకే ఆపరేషన్ సిందూర్ 2.0 భయం పాకిస్తాన్‌ను వెంటాడుతోంది. భారత సైన్యం దాడులకు దిగితే తిప్పికొట్టడానికి పీఓకేలోని మూడు సెక్టార్లలో కౌంటర్-అన్‌మ్యాన్డ్ ఏరియల్ సిస్టమ్స్(సీ-యూఏఎస్)ను పాక్ సిద్ధం చేసినట్లు భారత నిఘా వర్గాలు తాజాగా గుర్తించాయి. రావల్‌కోట్, కోట్లీ, భింబర్ సెక్టార్లలో వీటిని నెలకొల్పినట్లు పేర్కొన్నాయి. ఎల్‌ఓసీ వద్ద 30కిపైగా యాంటీ-డ్రోన్ యూనిట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గగనతల నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు ఎలక్ట్రానిక్ యుద్ధ సామర్థ్యాలు పెంచుకోవడం పాక్ వ్యూహంగా కనిపిస్తోంది.

శత్రు డ్రోన్లపై నజర్

భారత్‌లోని పూంచ్ సెక్టార్‌కు ఎదురుగా ఉన్న రావల్‌కోట్‌లో యాంటీ-డ్రోన్ల వ్యవస్థలను రెండో ఆజాద్ కశ్మీర్ బ్రిగేడ్ నిర్వహిస్తోంది. రాజౌరీ, నౌషెరా, సుందర్బనీ సెక్టార్లకు ఎదురుగా ఉండే కోట్లీలో వీటి నిర్వహణ బాధ్యతను మూడో ఆజాద్ కశ్మీరీ బ్రిగేడ్‌కు, భింబర్‌లో నిర్వహణను ఏడో ఆజాద్ కశ్మీరీ బ్రిగేడ్‌కు అప్పగించినట్లు తెలిసింది. ఎల్‌ఓసీ వెంట ఎలక్ట్రానిక్, కైనటిక్ కౌంటర్ యూఏఎస్‌లను పాక్ రంగంలోకి దించినట్లు సమాచారం. ఇందులో కీలకమైన స్పైడర్ వ్యవస్థ కూడా ఉంది. ఇది పది కిలోమీటర్ల దూరంలోని శత్రు డ్రోన్లను కూడా సరిగ్గా గుర్తించగలదు. అంతేకాకుండా పాక్ అమ్ముల పొదిలో సఫ్రా




యాంటీ%-%యూఏవీ జామింగ్ గన్ కూడా ఉంది. దీనిని మనుషులు ఆపరేట్ చేస్తుంటారు. 1.5 కిలోమీటర్ల దూరంలోని డ్రోన్లను కూల్చివేయొచ్చు. తక్కువ ఎత్తులో ఎగిరే శత్రు డ్రోన్లను కూల్చడానికి సంప్రదాయ గగనతల రక్షణ ఆయుధాలను కూడా పాక్ ఉపయోగిస్తోంది. జీడీఎఫ్ 35 ఎంఎం ట్విన్ బ్యారెల్ యాంటీ ఎయిర్‌క్రాఫ్ట్ గన్స్, అజ్నా ఎంకే-2, ఎంకే-3 మ్యాన్-పోర్టబుల్ ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు పాక్ వద్ద ఉన్నాయి. తక్కువ ఎత్తులో తక్కువ వేగంతో దూసుకొచ్చే డ్రోన్లను వీటితో కూల్చవచ్చు.

తుర్కియే, చైనాలతో పాక్ చర్చలు

ఇటీవలి కాలంలో పశ్చిమ సరిహద్దుల్లో భారత సైన్యం కదలికలు ముమ్మరమయ్యాయి. సైన్యం, నావికాదళం, వైమానిక దళం తరచుగా విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. గగనతల రక్షణ వ్యవస్థను బలోపేతం చేయడంతోపాటు పాక్ సరిహద్దుల్లో అధునాతన డ్రోన్లను మోహరిస్తున్నారు. ఈ పరిణామాలతో పాక్ అప్రమత్తమైనట్లు భారత నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరోవైపు నూతన డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల కోసం తుర్కియే, చైనాలతో చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. కౌంటర్%-%డ్రోన్ సామర్థ్యాల విషయంలో పాక్ సైన్యం చాలా బలహీనంగా ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలో ఈ విషయం నిరూపితమైంది. అందుకే డ్రోన్లతో జరిగే దాడిని తట్టుకోవడంపై పాక్ ప్రధానంగా దృష్టి పెట్టినట్లు భారత నిఘా వర్గాలు కనిపెట్టాయి.

# కిమ్స్ కాదు.. కిమ్స్ డాక్టర్ వేశాడా?



అమరావతి, ఏపీలో ప్రభుత్వం మెడికల్ కాలేజీల నిర్మాణం, నిర్వహణ టెండర్లకు సంబంధించిన అంశాలు వివాదాస్పదంగా మారుతున్నాయి. రాష్ట్రంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణానికి సంబంధించి పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ విధానం ద్వారా పూర్తి చేస్తామని ప్రభుత్వం చెప్పింది. అయితే అది ప్రైవేటీకరణ కాబట్టి అధికారంలోకి వచ్చిన మరుక్షణం.. అనుమతులను రద్దు చేయడమే కాదు.. అరెస్టులు సైతం చేస్తామంటూ జగన్మోహన్ రెడ్డి హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసిపి కోటి సంతకాల సేకరణ కూడా చేపట్టింది. అయితే ఈ పరిణామాల నడుమ ఓ నాలుగు ప్రభుత్వ కాలేజీలకు సంబంధించి టెండర్లను ఆహ్వానించింది ప్రభుత్వం. కానీ ఒకే ఒక్క కాలేజీకి కిమ్స్ టెండర్ వేసినట్లు అధికారులు సీఎం చంద్రబాబుకు తెలిపారు. మిగతావి జగన్మోహన్ రెడ్డి భయపెట్టడంతో ఎవరూ ముందుకు రాలేదని కామెంట్స్ వినిపించాయి. ఇటువంటి పరిస్థితుల్లో మరో బాంబు పేల్చారు అధికారులు. దరఖాస్తు చేసింది కిమ్స్ సంస్థ కాదని.. అక్కడ పనిచేసే డాక్టర్ ప్రేమ్ చంద్ అని ఇప్పుడు తాజాగా తెలుస్తోంది. టెండర్ దాఖలు చేసింది డాక్టర్ అయితే కిమ్స్ సంస్థ పేరు ఎలా చెబుతారని ఇప్పుడు ప్రశ్నలు వినిపిస్తున్నాయి. దీంతో ఈ అంశం కొత్త వివాదానికి దారితీసింది.

సీఎంకు అధికారుల వివరాలు..

ప్రభుత్వం తొలి విడతగా ఆదోని,, మదనపల్లి, పులివెందుల, మార్కాపురం మెడికల్ కాలేజీలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను అధికారులు సీఎంకు వివరించారు. ఈ నాలుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలను పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ విధానంలో నిర్మించి, నిర్వహించేలా సెప్టెంబర్ 10న ప్రభుత్వం టెండర్లు పిలిచింది. ఇందులో ఆదోని మెడికల్ కాలేజీ నిర్మాణానికి కిమ్స్ సంస్థ ముందుకు వచ్చిందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. అయితే ముందుకు వచ్చిన సంస్థతో ఒప్పందం చేసుకుని కాలేజీ నిర్మాణం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం అధికారులను ఆదేశించారు. అయితే ఇప్పుడు టెండర్ వేసింది కిమ్స్ కాదని.. అందులో పని చేసే డాక్టర్ ప్రేమ్ చంద్ అని తెలుస్తోంది. ఈ విషయంపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కూడా ధ్రువీకరించినట్లు సోషల్ మీడియాలో ప్రచారం నడుస్తోంది.

వైసిపి ఆందోళన పర్వం..


వాస్తవానికి వైద్య ఆరోగ్యశాఖలో ఇప్పటికే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్షిప్ విధానం నడుస్తోంది. ఆరోగ్యశ్రీ కూడా అలానే నడుపుతున్నారు. 108 తో పాటు టు 104 వాహనాలను కూడా అలానే నిర్వహిస్తున్నారు. వైసిపి హయాంలో కూడా అలానే నడిపారు. కానీ ఇప్పుడు ఈ ప్రభుత్వ మెడికల్ కాలేజీ ల నిర్వహణకు సంబంధించి పిపిపి విధానంలో అలానే ముందుకు వెళ్తామని ప్రభుత్వం చెబుతోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆందోళన చేస్తోంది. చివరకు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా కూడా ప్రభుత్వ విధానాన్ని సమర్థించారు. అయితే ఇప్పుడు టెండర్ వేసింది కిమ్స్ కాదు.. ఆ ఆసుపత్రిలో పనిచేసే డాక్టర్ అని కొత్తగా ప్రచారం మొదలైంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

## కెటిఆర్ సమక్షంలో పలువురు బిఆర్ఎస్‌లో చేరిక

గజ్వేల్, పంచాయతీ ఎన్నికల ఫలితాలతో జోరందుకున్న బీఆర్ఎస్ పార్టీలోకి వలసలు పెరిగాయి. మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఎర్రవల్లిలోని నివాసంలో శుక్రవారం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో 150 మంది కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు గులాబీ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు.

# అంతర్ జ్ఞానమే అందరికీ శ్రీరామరక్ష

తిరుపతి,మనిషిలోని క్షమాగుణమే అతడిని ఉన్నత స్థితిలో నిలుపుతుందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ స్పష్టం చేశారు. భౌతిక అంశాల జ్ఞానాన్ని విజ్ఞానమని.. అంతర్ జ్ఞానాన్ని జ్ఞానమని అంటారని వివరించారు. విజ్ఞానంతో మాత్రమే కొట్టుకుపోకూడదని చెప్పారు. భారతీయ విజ్ఞాన సమ్మేళనం లక్ష్యం జ్ఞానమని.. దీనిని ప్రపంచంలోని అందరికీ దగ్గర చేయాల్సి ఉందన్నారు. శుక్రవారం తిరుపతిలోని సంస్కృతి యూనివర్సిటీలో నాలుగు రోజుల పాటు జరగనున్న భారతీయ విజ్ఞాన్ సమ్మేళన్‌ను కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, సీఎం చంద్రబాబు నాయుడితో కలిసి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ ప్రారంభించారు. అనంతరం ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ మాట్లాడుతూ.. మనమంతా ఈ ప్రపంచానికి ఎంతో కొంత రుణపడి ఉన్నామన్నారు. మానసిక సంతృప్తి లేకపోతే ఎంత పొందినా సుఖం కలగదని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ స్వయంగా కర్తవ్యాన్ని నిర్దేశించుకుని ముందుకు సాగాలని మోహన్ భాగవత్ అన్నారు. విజ్ఞానశాస్త్రం, ధర్మశాస్త్రాల మధ్య వైరుధ్యమేమీ లేదని చెప్పారు. అనుభవంతో ఎంతో విజ్ఞానాన్ని సంపాదిస్తామన్నారు. 'సరైన మార్గంలో పయనిస్తే ఏదైనా సాధ్యమని స్వామి వివేకానంద వంటివారు బోధించారు. మార్గం సరైనదైతే లక్ష్యాన్ని కచ్చితంగా చేరగలం. ప్రపంచం వేగంగా ముందు కెళ్తోంది.. పోటీపడాలంటే సాధన అవసరం. విద్యతో పాటు క్రమశిక్షణ కూడా అలవడాలి. క్షమాగుణమే మనిషిని ఉన్నత స్థితిలో నిలుపుతుంది. మానసికంగా సంతృప్తి లేకపోతే ఎంతపొందినా సుఖం కలగదు. మనమంతా ఈ విశ్వానికి ఎంతోకొంత రుణపడి ఉంటాం' అని మోహన్ భాగవత్ అన్నారు.కొందరిలో ఎంత ఎదిగితే అంత అహంకారం పెరుగుతుందని చెప్పారు. ప్రపంచానికి భారత్ ఎంతో కొంత ఇవ్వాలన్నారు. మనుషులందరికీ సౌఖ్యం, సదుపాయాలు కావాలని చెప్పారు. సుఖమనేది కేవలం భౌతికపరమైనదని ఆయన అభివర్ణించారు. సుఖ దు:ఖాలు తాత్కాలికమైనవన్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో అభివృద్ధితోపాటే వినాశనం సైతం వచ్చేసిందంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ ఆందోళన వ్యక్తం చేశారు. శాస్త్ర విజ్ఞానంతోనే మానవాళికి సదుపాయాలు కలుగుతాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. మనం పొందుతున్న వాటిలో రెండో కోణం కూడా ఉంటుందన్నారు. ఖచ్చితంగా ప్రపంచంలోనే భారత్ గొప్ప దేశం అవుతుందన్నారు. ప్రపంచంలో భారతదేశం ఉన్నత స్థితిలోకి రావడంతోపాటు.. ప్రపంచానికి మన దేశం ఏమి ఇవ్వగలమే అంశంపై దృష్టి పెట్టాలని ప్రజలకు ఆయన సూచించారు. సృష్టిలో ప్రతి ఒక్కరికీ సుఖం కావాలన్నారు. మనిషి సాధించే జ్ఞానంతో సుఖాన్ని సాధించాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ అభిప్రాయ పడ్డారు. ఆహారం, నిద్ర, మైథునం జంతువులకు ఆనందాన్ని ఇస్తాయని.. జంతువు కంటే మనిషి భిన్నమైన వాడని తెలిపారు. ఏ జంతువు ఆత్మహత్య చేసుకోదన్నారు. శరీరము, మనసు, బుద్ధి, ఆత్మ ఉన్నదని తెలిసిన వాడు మనిషని ఆయన తెలిపారు. భౌతిక అవసరాలు తీర్చుకోవడం మాత్రమే వికాసం కాదని ఆయన అభిప్రాయపడ్డారు. సమాజంలో సుఖంగా ఉన్నవాళ్లు దుఃఖంతో ఉన్నవారంటూ రెండు వర్గాలుగా తయారు కాకూడదని హితవు పలికారు. మనుషులంతా సుఖంగా ఉండాలని కోరుకోవాలని.. అహంకారంతో ఉండకూడదని ఆయన సూచించారు. ఎవరికి ఏ భాష వచ్చొ ఆ భాషను ప్రజలకు అందుబాటులోకి తీసుకుపోవాల్సి ఉందని తెలిపారు. అప్పుడే అందరిలో బుద్ధి వికాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. భారతీయుల డీఎన్ఏలో మాత్రమే ధర్మ దృష్టి ఉందని ఆయన స్పష్టం చేశారు. భారత్ విశ్వ గురువు కావాలని ఆకాంక్షించారు. ఆర్థిక, సామాజిక, ధర్మ జ్ఞానాల్లో సంపూర్ణంగా మనం ప్రపంచానికి శక్తిని..దృష్టిని.. ఇవ్వాల్సి ఉందని ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ తెలిపారు.



Printed, Published and Owned by UPPUGALLA SANTHOSH KUMAR H.NO. 10-19/286/1, RAVINDRA NAGAR COLONY, NAGARAM VILLAGE, KEESERA MANDAL, DIST.RANGA REDDY, PIN -500083, TELANGANA, Printed at SRI SAI GRAPHICS 9-52/3, ROAD NO.8, S.V.NAGAR, NAGARAM KEESARA, DIST. RANGA REDDY, PIN -500083, TELANGANA . RNI No : TELTEL/2015/66279 Editor : UPPUGALLA SANTHOSH KUMAR Cell : +918247019090. Email : agranetha@gmail.com